ఓమ్

శ్రీ మహర్షి మలయాళ సద్గురు పరబ్రహ్మణే నమః

శ్రీ సఖా సద్గురు పరబ్రహ్మణే నమః

సుబోధినీ వ్యాఖ్యా సహితమగు

పంచభ్రమ నివృత్తి నిరూపణము

రచయిత:

శ్రీ విద్యానన్దగిరి స్వాములవారు

1993

ప్రథమ ముద్రణము: 1000ప్రతులు
ద్వితీయ ముద్రణము: 1000ప్రతులు
తృతీయ ముద్రణము: 2000ప్రతులు

వెల :

ప్రకాశకులు:
శ్రీ వ్యాసాశ్రమమువారు

ప్రతులకు:
మేనేజరు,
శ్రీ వ్యాసాశ్రమము.
వ్యాసాశ్రమం:పోస్టు; ఏర్పేడు: మార్గము;
చిత్తూరుజిల్లా. (ఆంధ్రప్రదేశ్)
పిన్ కోడ్: 517 621

ముద్రణ:

శ్రీ పారాశర్య ముద్రాక్షరశాల, శ్రీ వ్యాసాశ్రమము

శ్రీ సఖా సద్గురు స్వామినే నమః



శ్రీ శ్రీ శ్రీ సఖా సద్గురు స్వాములవారు.

ఓం తత్ సత్ ఓమ్

సూచన

పరిశుద్ధాత్మ స్వరూపులగు ప్రియాత్మ బంధువులారా! "పంచభ్రమ నివృత్తి నిరూపణము" అను ఈ పుస్తకమునకు ఇది తృతీయ ముద్రణము. ప్రస్తుతము దీని ముద్రణము చేయించువారు శ్రీమాన్ టంకసాల సత్యనారాయణగుప్తగారు, వీరి ధర్మపత్ని శ్రీమతి వసుంధరమ్మగారు. ఈ పుణ్యదంపతులు బహు పుణ్యకర్మలు జేసిన ఉదారహృదయులు. శ్రీ వ్యాసాశ్రమముననే గీతోపదేశసూచకమగు 1. శ్రీ కృష్ణార్జునరథము, 2. బ్రహ్మవిద్యాపాఠశాలా విద్యార్థుల ఆరోగ్యము నిమిత్తము నిధిని ఏర్పాటుజేసిరి. 3. ప్రతి సంవత్సరము పూర్ణభిక్ష జరుగుటకు మహా నిధిని యేర్పాటుజేసిరి. 4. తిరుమలయందు గోగర్భ తపోవనమున ఒక రూమును కట్టించిరి. 5, మరియు

స్వస్థానమైన పుంగనూరు నందు. 6. శ్రీ శైలము నందు. 7. షోళింగరము నందును గొప్ప గొప్పపుణ్య కార్యముల జేయించియున్నారు. నిధుల నేర్పరచియు నున్నారు. ప్రస్తుతము బ్రహ్మాత్మైక్య విజ్ఞాన జిజ్ఞాసతో శ్రీ వ్యాసాశ్రమమున సేవాపూర్వకముగా స్వీయ భోజనముతో నివసించుచున్నారు. ఇట్టి పవిత్ర భక్తులను భకవత్సలుడగు భగవంతుడు భక్తి జ్ఞాన యోగ వైరాగ్యములతో అనుగ్రహించును గాక!

మఱియు నొక గమనిక:- ఏమనగా ఈ పంచ భ్రమ నివృత్తి నిరూపణమును ఎవ్వరు రచించిరో తెలియక ఇదివరలో ఒక మహాపండితోత్తముని రచనగా వ్రాయబడి యుండెను. కాని యిది అన్న పూర్ణోపనిషత్తులో మొట్టమొదటనే యుండుటను తెలిసి కొని ఇది ఉపనిషత్తే యని సంతసించుచున్నాము.

ఓమ్ విద్యానన్ద గిరి స్వామి

ఓమ్

విషయ సూచిక

ఓమ్

ప్రాస్తావికము

పరిశుద్ధ బోధస్వరూపులారా! తరించుట కుపాయము లనేకములు. వానిలో స్వరూపముచేతను, విషయముచేతను మిక్కిలి సూక్ష్మమైనది పంచభ్రమ నిరూపణము. ఉత్తమాధికారులకు దీని విచారణ అపరోక్ష సాక్షాత్కార సాధనమగును. 'పిట్ట చిన్నది కూత ఘనము' అను సామెత దీని విషయమున సార్థకమైనది. ఈ గ్రంథమును రచించిన మహనీయుడెవ్వడో తెలియకున్నది. అయిననూ దీనిని బట్టిచూడ ఆ మహాత్ముడు తీవ్రబ్రహ్మనిష్ఠుడని, లోకోపకారబుద్ధితో దీనిని రచించెననియునూ గోచరించకమానదు. పదిన్నరశ్లోకములలో శాస్త్ర మర్యాదల సమకూర్చి, జిజ్ఞాసుల సమస్తభ్రాంతుల దొలగొట్టి

బ్రహ్మపరోక్ష సాక్షాత్కారమును కరతలామలక మొనర్ప గలిగిన మహాచతురు డాపండిత ప్రవరుడు. ఆ పరమపూజ్యుని పాదపద్మములకు మనః పూర్వక నమస్కారములు.

ఈ శుభకృత్పుష్య మాసమున శ్రీ మాతృదేవి మన్నెము సీతారామమ్మగారు శ్రీ శివగిర్యాశ్రమమున నివసించిరి. శ్రీ అమ్మగారి పరిచయమైనది మొదలు కొని వారియందు సత్కర్మనిష్ఠ, గురు దైవభక్తి పరాయణత, ఏకాదశ్యాది వ్రతాచరణ, జప ధ్యానా దికము, ఆత్మవిచారణ, నిరాడంబరము, నియమనిష్ఠ, సాధువుల సత్కరించుట, విద్యార్థుల కుపకరించుట మొదలగునవియే నాకు గోచరించుచుండును. నా విద్యార్థి దశయందు, సన్న్యాస స్వీకారమునందునూ మిక్కిలి తోడ్పడియున్నారు. వేదాంత విచారణా విషయమున శ్రీమాతృదేవికి, వారి సుపుత్రులు శ్రీయుత శ్రీనివాసరెడ్డిగారికిని ఈయుపాధితో మిక్కిలిసన్నిహిత

సంబంధము గలదనుట సత్యదూరము గానేరదు. ఆ
కారణముచేతనే గాబోలు శ్రీ శివగిర్యాశ్రమమునకు
అప్పుడప్పుడు వచ్చుచుండుట, సహకరించుచుండుట
జరుగుచుండునని తోచుచుండును. పూర్వపు చొరవు
చేతనే యీ మారు శ్రీ శివగిర్యాశ్రమమునకు వచ్చి
నపుడు శ్రీ అమ్మగారు పంచభ్రమ నిరూపణమును
గూర్చి శ్రవణ మొనర్ప గోరిరి. దీని ప్రబోధము
పూర్తియైన పిదప ఈ బోధిత విషయము గ్రంథ
రూపము దాల్చినచో లోకమున కుపకరించగలదను
భావము గలిగెను. తరువాత శ్రీ అమ్మగారియొక్కయు
ఆశ్రమవాసులయొక్క యీ ప్రోత్సాహము చేత
గ్రంథ రచన కుపక్రమించితిని. కేవల పంచభ్రమల
నిరూపణమేగాక వాని నివృత్తి నిరూపణముగూడ
ద్రష్టలకు, శ్రోతలకు స్ఫురించుట సముచితమగునని
యీ గ్రంథమునకు 'పంచభ్రమనివృత్తినిరూపణము'
అని నామకరణ మొనర్పబడినది. మఱియు ప్రాయశః

జిజ్ఞాసులందరికి సుబోధమగునట్టి సులభమైనసరణితో రచించ దలంచియే శీర్షిక, అవతారిక, మూలము, పదవిభాగము, ప్రతిపదార్థము, తాత్పర్యము, విశేషార్థము అను విశేషములతో వ్యాఖ్య యొనర్పబడినది. కనుక ఈ వ్యాఖ్యకు 'సుబోధిని' అని పేరు పెట్టబడినది. ఈ వ్యాఖ్యకు విచార చంద్రోదయ షష్ఠకలయందు గల ఈ పంచభ్రమ నివృత్తుల విచారము మిక్కిలి సహకరించినది. కనుక ఆ గ్రంథకర్తయగు శ్రీ పండిత పీతాంబరశాస్త్రులవారికి హార్దిక కృతజ్ఞత తెలుపబడుచున్నది. పాఠకులకు ఆ యా విషయములు సువిదితములై బ్రహ్మను సంధానమేర్పడుట కుపకరించగలందులకు ఆత్మబోధాదుల నుదాహరణములుగూడ అధికముగానే యివ్వబడినవి. చాలవరకు సంధులుగూడ ఆదరింపబడలేదు. పంచభ్రమ నిరూపణమను మూలగ్రంథమున మొదట భేదాది పంచభ్రమలయొక్క స్వరూపములన్నియు

నిరూపింపబడి తరువాత క్రమముగా వాని నివృత్తు లన్నియు నిరూపింపబడినవి. ఈ గ్రంథమున సులభ ముగా విషయ మవగాహన యగుటకొఱకు ఆ యా భ్రమ నిరూపణానంతర మచ్చటనే వాని వాని నివృ త్తియు నిరూపింపబడినది. అందుచేత శ్లోకములు తారుమారైనవి. అయిననూ మూలగ్రంథమునందలి శ్లోక క్రమము స్ఫుటముగా దెలియుట మొదలగువాని కొఱకు గ్రంథాంతమున ఆ శ్లోకములన్నియు మూల గ్రంథానుసారముగా ముద్రింపబడినవి. మఱియు జిజ్ఞా సులకు బ్రహ్మానుసంధా నార్థము శ్రీ శంకరభగవత్పాద విరచితమగు విజ్ఞాన నౌకయు చేర్చబడినది.

శ్రీ కాశీహిందూ విశ్వవిద్యాలయమున అధ్యయన మొనరించునపుడు శ్రీశ్రీశ్రీ సఖా సద్గురు దేవుని పరి చయ భాగ్యము గలిగినది. అధ్యయనానంతరము శ్రీవారి సన్నిధిలో దాదాపు సంవత్సరము గడచినది. అప్పుడు శ్రీవారు యోగజ్ఞానముల నుపదేశించిరి.

ప్రాస్తావికము

శ్రీ మహర్షి మలయాళ సద్గురు దేవుని యనుగ్రహము వల్లనే శ్రీ సఖా సద్గురు దర్శనముగూడ లభించినదని నా విశ్వాసము. శ్రీ వైకుంఠాశ్రమాధిపతులగు శ్రీ వేంకటేశ్వర మహాశయులు శ్రీవారి పవిత్ర చరిత్రాంశముల నా కందజేసి మిక్కిలి సహకరించిరి. వారికి నా ధన్యవాదములు. ఇందేవైన పొరబాటులు గోచరించినచో విద్వాంసులు, మహాత్ములు తెలిపిన యెడల అవి ప్రేమతో మరు ముద్రణమున సవరింప బడును. ఈగ్రంథమును చక్కని కూర్పుతో మిక్కిలి రమణీయముగా ముద్రించి యిచ్చిన శ్రీ పారాశర్య ముద్రాక్షరశాల శ్రీ వ్యాసాశ్రమంవారు ప్రశంస నీయులు.

ఓమ్

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః

ఓం తత్ సత్ ఓమ్

ఓమ్

శ్రీ సఖా సద్గురు పరబ్రహ్మణే నమః

శ్రీ సఖా సద్గురు చరిత్ర సంగ్రహ సారము

భారతభూమి పుణ్యతమమైనది. ఇందు మహాత్ములు లేని ప్రదేశము లేనేలేదు. ఇందుననూ ఉత్తర ప్రదేశము ప్రశస్తమైనది. శ్రీరామకృష్ణాది రూపములతో శ్రీ భగవంతు డవతరించిన దటువైపుననేకదా! సాధువులు కోకొల్లలుగా నిండియుండునదియునూ ఆ ప్రదేశముననేకదా! మహనీయుడు ప్రస్తుత కథా నాయకుడు అయిన శ్రీ గిరీశచంద్రశర్మ ఆ దేశీయుడే యగుట విశేషము. ఈ పూత చరితుని జన్మభూమి శ్రీకృష్ణ జన్మస్థానమగు మధురకు నాలుగయిదు యోజనముల దూరమున నున్న 'బ్రహ్మకాశి' అను

గ్రామము, దీని నిప్పుడు 'ఖైర్' అని వ్యవహ రింతురు. ఇది అలీగఢకు సమీపమున గలదు. మహాత్ము లెప్పుడునూ ఉత్తములగు మాతా పితరు లకే యుద్భవించుచుందురుసుమా! ఈ పుణ్యపురు షుని తల్లిపేరు గంగాదేవి. తపస్వినియగు నీయమ ప్రాతః స్మరణీయ. మదాలసా సంతానమువలె ఈ తల్లి స్త్రీ పురుష సంతానమంతయు కుండలినీ యోగ మును, బ్రహ్మవిజ్ఞానమును కలిగియుండును. తండ్రి పేరు శ్రీ చిరంజీ లాల్. ఈయన మిక్కిలి సహృద యుడు. శ్రీకృష్ణభక్తుడు. వీరి తండ్రి శ్రీ పరశురామ పండితుడు. పరమశివభక్తుడు. ఇట్టి బ్రాహ్మణ పవిత్ర కుటుంబమున స్వస్తిశ్రీ చాంద్రమాన విరోధికృన్నామ సంవత్సర మాఘ కృష్ణ చతుర్దశీ మహాశివరాత్రి పర్వ దినమున రాత్రి ఇంచుమించు 9 ఘంటలకు ఈ మహాత్ము డావిర్భవించెను. "పూవు బుట్టిన తోడనే తావి గొలుపు" అన్నట్లు ఈ మహోదయుడు పసి

తనము నుండియే శ్రీ సూర్యనారాయణోపాసన తీవ్రముగా సలుపుచుండెను. మఱియు ఒక్కొక్కమారు కిరీటము, పీతాంబరము ధరించి శ్రీకృష్ణభక్త్యావేశముతో నర్తన మొనర్చుచుండెను. కనుకనే పిన్నపెద్దలు సయితము ఈ బాలకుని గూడి యానందించుట కుత్సాహపడుచుండెడివారు. క్రమముగా పెరిగి పెద్దయగుకొలది విద్యావంతుడగుటయేగాక అనన్యభక్తి, కుండలినీయోగము, బ్రహ్మవిజ్ఞానమునూ కలవాడయ్యెను. భక్తిమార్గమున నీ పవిత్రవర్తనుని అనన్యభక్తునిగా తీర్చి దిద్దినది బృందావనవాసియగు ప్రసిద్ధ సిద్ధపురుషుడు శ్రీ ఒడియాబాబా. ఈ పరమభక్త శిఖామణికి కుండలినీ దీక్షాప్రదాత ఋషికేశవాసియగు యోగిపుంగవుడు శ్రీ యోగానందబాబా. అద్వైత బ్రహ్మతత్త్వమును ప్రబోధించి బాగుగా బలపరచిన పరమపూజ్యుడు త్యాగమూర్తి వంగదేశీయుడగు బ్రహ్మశ్రీ రాజేంద్రగిరిబాబా. హిమవ

త్పర్వతారణ్యములలో తీవ్రతపం బొనర్చి పై మూడిం టిలో సిద్ధి నందుకొన్న ప్రసిద్ధుడు శ్రీ సఖా సద్గురుడు. ఈ సద్గురు దేవుడు జాతి, మత, దేశ భేదములపట్టింపు లేక సదా అద్వైతాత్మానందముతో నిండియుండు నిండుకుండ. శిష్యులతో సయితము సఖ్యముతో మెలగు సరళస్వభావము కలిగియుండుటనుబట్టి సఖా నామము సార్థకమయ్యెను. ఈ మహానుభావుని స్వరూప స్వభావముల సంగ్రహముగా గ్రహించు టకు ఆయన రచించిన హిందీపద్య మిందు పొందు పరచబడినది.

జో తీనకాల మే బాధ్య న హోవహ ఆత్మసఖా కహలాతా హై
హైసబకాసచ్చా మిత్ర పూక సే సబ కేభరమ మిటాతా హై।
వహ అంధే అంతఃకరణ దేశ మే జగమగ జ్యోతి జలాతా హై
ఖులగయే ముక్తి కే ద్వార నమ్ర హోకర జో దరపద ఆతా హై॥


తా॥ కాలత్రయమునందు అబాధ్యమగు ఆత్మయే సఖుడు. ఆయన ఎల్లరకు ఎడబాయని మిత్రుడు. ఎల్లరి భ్రమలను ఆయన ఉప్పని ఊది ఎగురగొట్టును. అంధకారబంధురమగు హృదయమున ఆయన దివ్య జ్యోతి వెలిగించును. ఆయన ద్వారమునకు నమ్రుడై వచ్చినవారికి మోక్షద్వారము తెరచుకొనుచున్నది.

ఈ మహాత్ముని జాతక చక్రమును మఱియు శుక్ర నాడీ గ్రంథమున నీ దివ్యపురుషునిగూర్చి మహేశ్వరుడు నారదునితో దెలిపిన కొన్ని వాక్యములను ఉదహరించి ఈ చరిత్ర సమాప్తము గావింపబడును.

జాతక చక్రము.

స్వస్తిశ్రీ చాంద్రమాన విరోధికృన్నామ సంవత్సర మాఘ కృష్ణ చతుర్దశీ శ్రీ మహాశివరాత్రి శుక్రవారము సూర్యోదయము మొదలుకొని ముప్పది

తొమ్మిది ఘటికలకు శ్రవణ నక్షత్ర తృతీయచరణమున తులాలగ్నమున జననము.(క్రీ. శ. 1912 సం. ఫిబ్రవరి 16వ తేది).



ఈ దివ్యపురుషుడింతకుముందు దక్షిణదేశమున వెలసెను. సంకల్పసిద్ధుడు. వరప్రసాదముచే మరల

నుత్తరదేశమున అవతరించెను. చిద్విలాసపురుషుడు. మాతృగర్భమునకు వచ్చినప్పటినుండియు స్వీయ భక్తులగూర్చి చింతించుచుండెను. జననకాలముననే తనవారల జన్మరహస్యముల నెరిగియున్న దేవ పురుషుడు. భక్తతారణ వ్యూహ రచన నారంభించెను. శైశవమున ప్రథమసాంగత్యము నాతోడను (మహేశ్వరునితో) గోపాలునితోడను కలిగెను. ఆ గోపాలుని వంటివాడే, ఆనందచంచలస్వభావుడు. నాయంతటి వాడు. అయినను విర్లిప్తుడు. సర్వయోగ సంస్కర్త. ఆయన పూర్వసఖులాయనతోకలసి పనిచేయ వచ్చియున్నారు. ఆయన గతులు దుర్జ్ఞేయములు. ప్రభావమమేయము. చిద్విలాస యోగబలముచే భక్తునకు సర్వము సిద్ధింపజేయువాడు. ఈ జన్మమున 2 వేల మంది భక్తుల తరింపజేయును. ఆఖరున ఆయన దివ్య జన్మకర్మరహస్యము లోకమున కెరుకపడును. ఇది

యంతయు శ్రీ మహేశ్వరుడు నారదమహర్షికి తెలిపి నటుల శుక్రనాడీగ్రంథమున చెప్పబడియున్నది. ఓమ్

ఓం లోకాస్సమస్తాస్సుఖినో భవంతు

ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః

ఓం తత్ సత్

ఓమ్

ఓమ్

ఓం పరమగురుభ్యో నమః   ఓం సర్వమహర్షిభ్యోనమః

ఓం నమో భగవతే దక్షిణామూర్తయే

సుబోధినీ వ్యాఖ్యా సహితమగు

పంచభ్రమ నివృత్తి నిరూపణము

❖❖❖❖❖❖

గ్రంథారంభము

అవతారిక, మంగళాచరణము, బ్రహ్మ విద్యాధికారము, గురూపసదనము, ఆత్మ జ్ఞాన సాధన ప్రశ్న. బ్రహ్మవిద్య మోక్షదము అనునవి ఇచట ఉల్లేఖింపబడుచున్నవి.

మూ॥ విదాఘో నామ యోగీంద్రః ఋభుం బ్రహ్మవిదాం వరమ్।
ప్రణమ్య దండవద్భూమా వుత్థాయ స పునర్మునిః ॥

" ఆత్మతత్త్వమను బ్రూహి త్వేవం పప్రచ్ఛ సాదరమ్ ।
కయోపాసనయా బ్రహ్మన్నీదృశం ప్రాప్తవానసి ॥

" తాం మే బ్రూహి మహావిద్యాం మోక్షసామ్రాజ్యదాయినీమ్

పదవిభాగము॥ నిదాఘః - నామ - యోగీంద్రః - ఋభుం - బ్రహ్మవిదాం - వరం - ప్రణమ్య - దండవత్ - భూమౌ - ఉత్థాయ - సః - పునః - మునిః - ఆత్మతత్త్వం - అనుబ్రూహి - ఇతి - ఏవం - పప్రచ్ఛ - సాదరం - కయా - ఉపాసనయా - బ్రహ్మన్ - ఈదృశం - ప్రాప్తవాన్ - అసి - తాం - మే - బ్రూహి - మహావిద్యాం - మోక్షసామ్రాజ్యదాయినీం.

ప్రతిపదార్థము॥ నిదాఘోనామ = నిదాఘుడు అని ప్రసిద్ధిజెందిన, యోగీంద్రః = యోగిపుంగవుడు, బ్రహ్మవిదాం = బ్రహ్మవేత్తలలో, వరం = శ్రేష్ఠుడైన, ఋభుం = ఋభు మహర్షినిగూర్చి, భూమౌ = భూమియందు, దండవత్ = కఱ్ఱవలె, ప్రణమ్య = నమస్కరించి, ఉత్థాయ = లేచి, పునః = మరల, మునిః = మననశీలుడైన, సః = ఆ నిదాఘుడు, బ్రహ్మన్ = ఓ బ్రహ్మవిద్వరా!, ఆత్మతత్త్వం = ఆత్మతత్త్వమును గూర్చి, అనుబ్రూహి = ప్రబోధింపుము, కయా = ఏ

ఉపాసనయా = ఉపాసనచేత, ఈదృశం = ఇటు వంటి బ్రహ్మవిద్యను, ప్రాప్తవాన్ =పొందినవాడవు, అసి = అగుచున్నావు!, తాం = ఆ, మోక్షసామ్రాజ్య దాయినీం = మోక్షసామ్రాజ్యము నొసంగునట్టి, మహావిద్యాం = మిక్కిలి గొప్పదగు బ్రహ్మవిద్యను, మే = నా కొఱకు, బ్రూహి = చెప్పుము, ఇత్యేవం = ఈ ప్రకారముగా, సాదరం = ఆదరముతో కూడ, పప్రచ్ఛ = అడిగెను.

తాత్పర్యము॥ నిదాఘుడని ప్రసిద్ధి జెందిన యోగి పుంగవుడు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠులైన ఋభుమహర్షుల వారియొక్క సన్నిధికి వెళ్ళి భూమిమీద దండమువలె చక్కగా సాష్టాంగముగాబడి నమస్కరించి లేచి సమయోచిత కర్తవ్యమునుగూర్చి చక్కగా నాలోచించు స్వభావముగల నిదాఘుడు ఓ బ్రహ్మవిద్వరా! కరుణించి ఆత్మతత్త్వము ననుగ్రహింపుడు. ఏ యుపాసన యొనర్చి అత్యద్భుతమగు నీ యాత్మవిజ్ఞానము

వార్జింపగలిగితిరి? మోక్షసామ్రాజ్యము నవలీలగా నొసంగునట్టి మిక్కిలి గొప్పదగు నా బ్రహ్మవిద్యను నా కుపదేశింపుడు. అని మిగుల నాదరముతో బ్రశ్నించెను.

మంగళాచరణము

విశేషార్థము॥ "ఆశీర్న మస్క్రియా వస్తునిర్దేశో వాపి తన్ముఖమ్". గ్రంథముయొక్క ప్రారంభము ఆశీర్వాదము, లేక నమస్కారము, అథవా వస్తు నిర్దేశము అనబడు మంగళాచరణరూపముగా నుండవలయుననెడి శాస్త్ర నియమముననుసరించి ఇచట "విదాఘోనామ .... ప్రణమ్య దండవద్భూమౌ" అని చెప్పబడుటచేత నీగ్రంథ ప్రారంభము శ్రీ సద్గురు నమస్కారాత్మకమగు మంగళాచరణరూపముగా నున్నది. మరియు "సమాప్తి కామో మంగళమాచరేత" ప్రారంభింపబడిన గ్రంథము నిర్విఘ్న

ముగా పరిసమాప్తము గావలయునని కోరువాడు ఉక్త త్రివిధ మంగళములలో నేదేని యొకదాని నాచరింపవలయును. అను వచనమునుబట్టియును పై గ్రంథము నమస్కారరూపమగు మంగళమును గలిగి యుండుటవలన నిర్విఘ్నముగా బరిసమాప్తమై కరుణానిధియగు శ్రీ గురుదేవునియొక్క, భక్త వత్సలుడగు శ్రీ భగవంతునియొక్క అనుగ్రహమున నకు పాత్రమగునని యెరుగవలయును.

ఉత్తమాధికారి

ఎవనికి పూర్వజన్మలయందు లేక వర్తమాన జన్మయందు పరమేశ్వరార్పణ బుద్ధితోనాచరింపబడిన నిష్కామకర్మలవలన, ఉపాసనవలననూ చిత్తశుద్ధి, చిత్తైకాగ్రతయునూ లభించినవో, ఆవరణ దోషము మాత్రము మిగిలియున్నదో, మరియు సాధన చతు ష్టయ సంపత్తియునూ సమకూడినదో ఆ యధికారి

అనంతరము బ్రహ్మజిజ్ఞాస చేయవలయునని శ్రీ వేద వ్యాస మహామునులు "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" అను సూత్రమున వచించియున్నారు. ఈ యర్థమును ఇచట గల "యోగీంద్రః" అను పదము, తదనంతరోత్తర గ్రంథమునూ సూచించుచున్నవి. అనగా నిదాఘుడు నిష్కామ కర్మలను మాత్రమేగాదు, అభ్యాస వైరాగ్యములతోడ సమాధి పర్యంతము సమాహితచిత్తుడై యోగమునుకూడ ననుష్ఠించిన వాడు. కనుకనే అతనికి ప్రమాణ, విపర్యయాది చిత్తవృత్తులన్నియు నిరుద్ధములైనవి. అందుచేత మలము, విక్షేపమునూ తొలగిపోయి శుద్ధము, ఏకాగ్రమునునగు చిత్తమును, నిత్యానిత్య వస్తువివేకమును, ఇహాముత్ర ఫల భోగ విరాగమును, శమాది షట్కసంపత్తిని కలిగియున్నాడని యోగీంద్రపదము సూచన జేయుచున్నది. మఱియు మోక్షాపేక్షచే జ్ఞానార్థియై నిదాఘుడు ఋభుమహర్షి సన్నిధి కరిగె

నని తదనంతరోత్తర గ్రంథము వ్యక్తము జేయుచూ అతడు తీవ్రమగు ముముక్షుత్వము గలిగియున్నాడని స్ఫురింపజేసినది. ఇందుచేత సిద్ధాఘుడు బ్రహ్మజిజ్ఞాసకు ఉత్తమాధికారి యగునని విస్పష్టమగుచున్నది.

గురూపసదనము

అధికారియగు జిజ్ఞాసువు బ్రహ్మాత్మ విజ్ఞానము కొఱకు ఫలపుష్పాదుల గైకొని శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడగు శ్రీసద్గురుదేవునియొక్క సన్నిధికి వెళ్లి భక్తి శ్రద్ధలతో ఆ ఫలపుష్పాదులను శ్రీవారికి సమర్పించి, నమస్కరించి ప్రభో! తమరే గతి; అన్యగతి లేదు; సంసారదావానల తాపముచేత పరితపించుచున్నాను. అనుగ్రహింపుడు; అని శరణు జొచ్చి ఆత్మతత్త్వమును ప్రబోధింపుడని ప్రార్థించవలయును. ఇది గురూపసదన మనబడును. పిదప వినయ విధేయతలతో ఆత్మతత్త్వమునుగూర్చి ప్రశ్నింపవలయును.

అని "తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛే త్సమి త్పాణిశ్శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్". "ఆచార్యవాన్ పురుషోవేద" ఇత్యాది శ్రుతులు. "తద్విద్ధి ప్రణిపా తేన" ఇత్యాది స్మృతులునూ ఉపదేశించుచున్నవి.

శ్రీ వామదేవాదుల వంటి భావి ప్రతిబంధము మాత్రము గల మహానీయులెవ్వరో ఒకరిద్దఱు దప్ప అందరునూ గురూపదేశమును బడసియే బ్రహ్మవిద్య నభ్యసించిరి. శ్రీ వామదేవాదులునూ పూర్వజన్మ మున సద్గురువులచే నుపదిష్టులై జ్ఞానవంతులైరి. అయిననూ వారి ఆ పూర్వజన్మ జ్ఞానము భావి ప్రతిబంధ సహితమగుటచేత అప్పుడు మోక్షమును బడయజాలక ఆ శరీరముల వదలి మరల జన్మించి గత జన్మమునందలి గురూపదేశము వలననే వామ దేవాది జన్మమున ప్రతిబంధ రహిత బ్రహ్మ సాక్షాత్కారము గలవారై ముక్తులైరి. శ్రీ వామదేవుడు మాతృ గర్భమునందుండియే ఉక్త సాక్షాత్కార

మును బడసెననుట విశేషము. కనుక ప్రతివ్యక్తి సద్గురువులచే నుపదిష్టుడై, శిక్షితుడై ఆత్మవిజ్ఞానమును సంపాదించవలసియుండునని గమనించదగినది. అట్టి వ్యక్తి శ్రీ సద్గురువుల యనుగ్రహపాత్రుడై, సంప్రదాయ రహస్యములగూడ చక్కగా నెరిగి, సంశయ రహితముగా బ్రహ్మ విజ్ఞానమును బడయగలుగును. కావుననే

"గురుని శిక్ష లేక గురుతెట్లు కలుగునో
అజునికైన వాని యబ్బకైన
తాలపుచెవిలేక తలుపెట్లు లూడును
విశ్వదాభిరామ వినరవేమ!"

అని శ్రీ వేమనయోగి,

"ధరణి లోపల నా గురుతత్త్వములకు
నవ్వలై యున్న తత్త్వంబు నెవ్వడెరుగు
శివుడు గురు రూపమున వచ్చి చెప్పకున్న
నవ్యతరభోగి శ్రీ సదానందయోగి"

అవి శ్రీ సదానందయోగి. ఏ విద్యకైన గురువు లేకున్న నా విద్య పట్టుబడదు. కావుననభ్యాసికి గురుశిక్ష కావలెను నారాయణా. అని నారాయణ శతక కర్తయునూ వచించిరి. గురూపసదన పూర్వకముగానే గురుదేవుడు లభించగలడు. కనుక గురూపసదన మత్యావశ్యకమైనది. పూర్వులునూ అత్యావశ్యకమగు గురూపసదన మొనర్చియే సద్గురువుల సంపాదించి తత్త్వము నరసి తరించిరని గ్రహించదగినది. ప్రకృతము ననుసరింతము.

ప్రస్తుత మిచట "ఋభుం బ్రహ్మవిదాం వరమ్" మొదలుకొని "పప్రచ్ఛ సాదరమ్." వరకు గల గ్రంథము గురూపసదనమునుగూర్చి బోధించుచున్నది. అనగా ఈ గ్రంథము మోక్షేచ్ఛతో ఆత్మతత్త్వజ్ఞానార్థమే తెంచియుండుటవలన నిదాఘుడు తీవ్రముముక్షుత్వము గలిగియున్నాడని సూచించుచూ, అతడు బ్రహ్మవిద్వరులు గాబట్టియే శ్రోత్రియబ్రహ్మ

విష్ణులగు ఋభు మహర్షులవారి సన్నిధికి వెళ్ళి, విధి పూర్వకముగా సాష్టాంగ దండ ప్రణామ మొనరించి, శరణు బొంది, ఆత్మతత్త్వము నుపదేశింపుడని ప్రార్థించె ననుటను బోధించుచూ నిదాఘుని గురూప సత్తిని ప్రకటించినది.

ఆత్మజ్ఞాన సాధన ప్రశ్న

శ్రీ గురుదేవుని భక్తితో నారాధించి ప్రసన్నుడగు నా గురుచంద్రునితో ఆత్మవిషయమునుగూర్చి ప్రశ్నించవలయునని "తమారాధ్యగురుం" ఇత్యాదికముతో వివేకచూడామణి బోధించినరీతిగా బ్రహ్మ జిజ్ఞాసుడగు నా నిదాఘుడు ఋభుమహర్షులవారితో ప్రశ్నించె ననుటను "కయోపాసనయా బ్రహ్మన్నీదృశం ప్రాప్తవానసి" ఓ బ్రహ్మజ్ఞానసంపన్నుడా! ఏ యుపాసనయొనర్చి మీరీ ఆశ్చర్యకరమగు ఆత్మజ్ఞానమును సంపాదింపగలిగితిరి? అను గ్రంథము విశ

దము చేసినది. శ్రీ ఋభుమహర్షులవారు తమ గురుదేవుల సన్నిధిలో పంచభ్రమలను, వాని నివృత్తులను గూర్చి విచారించి ఆత్మవిజ్ఞానమును బడసిరి. ఈ విషయము ఇచట "తదా ప్రభృతిమచ్చిత్తం" ఇత్యాది గ్రంథమునుబట్టి తెలియగలదు. వాని విచారణయే ఉత్తమాధికారికి ఆత్మవిజ్ఞానసాధనమగును. అందుచేత శ్రీ ఋభుమహర్షులవారు ఉత్తమాధికారి, జ్ఞానార్థియునగు నిదాఘునికి ఈ గ్రంథమున ఆత్మవిజ్ఞానముకొఱకు వానినే బోధించిరని గ్రహించదగినది.

బ్రహ్మజ్ఞానము మోక్షదాయకము.

పంచభ్రమనివృత్తి విచారణవలన జనించు బ్రహ్మాత్మ విజ్ఞానము కైవల్యమను మోక్షమునకు సాక్షాత్సాధనమగును. కనుకనే "జ్ఞానాదేవతు కైవల్యమ్" ఇత్యాది శాస్త్రములు బ్రహ్మాత్మ

సాక్షాత్కారరూపమగు జ్ఞానమువలన కైవల్యరూపమగు మోక్షము లభించును; అని బోధించుచున్నవి. ఈ యర్థమును ఈ గ్రంథమున "తాంమే బ్రూహి మహావిద్యాం మోక్షసామ్రాజ్యదాయినీమ్" కైవల్య మోక్షదాయకమగు బ్రహ్మవిద్యను నా కుపదేశింపుడు అనునది వచించినది.

ఈ విధముగా నీ ఘట్టము పూర్వోక్త శ్రుతి స్మృతులు శాసించినట్లు గురుశిష్య సంప్రదాయానుసారముగా అధికారి బ్రహ్మవిద్యను సంపాదింపవలయు ననుటను మంగళాచరణముతోకూడ విశదముగా ప్రతీయమానమొనర్చినదని యెరుగవలయును.

అభయ ప్రదానాదికము.

అవ॥ శ్రీ గురుదేవుని యొక్క అభయప్రదానము, ఆత్మవిజ్ఞానముచేత జీవన్ముక్తియునూ తెలుపబడుచున్నది.

మూ॥ నిదాఘ। త్వంకృతార్థోసిశృణు విద్యాం సనాతనీమ్।
యస్య విజ్ఞానమాత్రేణ జీవన్ముక్తో భవిష్యసి॥

పద॥ నిదాఘ -త్వం - కృతార్థః -అసి - శృణు- విద్యాం - సనాతనీం-యస్య - విజ్ఞానమాత్రేణ - జీవన్ముక్తః - భవిష్యసి.

ప్రతి॥ నిదాఘ! = ఓ నిదాఘూ!, త్వం = నీవు, కృతార్థః = కృతకృత్యుడవు, అసి = అగుచున్నావు, యస్య=ఏయాత్మతత్త్వముయొక్క, విజ్ఞానమాత్రేణ= అపరోక్షజ్ఞానమాత్రముచేత, జీవన్ముక్తః = జీవించియుండగనే ముక్తుడవు, భవిష్యసి = కాగలవో, (తస్య=ఆ యాత్మ తత్త్వముయొక్క). సనాతనీం = శాశ్వతమైన, విద్యాం = విద్యనుగూర్చి, శృణు = వినుము.

తా॥ నాయనా నిదాఘూ! రాజవిద్యయగు ఆత్మ విద్యనుగూర్చి ప్రశ్నించితివి. కనుక నీవు నిజముగా

ధన్యుడవై తివి. ఇక సంసారరాక్షసునివలన భయపడ బనిలేదు. ఏ యాత్మ యథార్థస్వరూపముయొక్క అపరోక్షసాక్షాత్కార మాత్రము చేత ఇచ్చట జీవించియుండగనే సర్వదుఃఖ నివృత్తిని పరమానంద మును (జీవన్ముక్తిని) బడయుదువో ఆ యాత్మ యథార్థస్వరూపమునకు సంబంధించినట్టి శాశ్వత మగు నాత్మవిద్యను నీ కుపదేశించుచున్నాను. సావ ధాన మనస్కుడవై వినుము.

వి శే॥ విధిపూర్వకముగా శరణాగతుడై ఆత్మ తత్త్వ జ్ఞానార్థియై ప్రశ్నించిన అధికారియగు శిష్యుని గూర్చి ఆచార్యుడు ప్రప్రథమమున దయార్ద్రదృష్టితో అభయప్రదానము చేయవలయును. అనగా నాయనా! భయపడవలదు. నీ కేమియు నపాయము లేదు. బ్రహ్మాత్మ విజ్ఞానముచే జీవన్ముక్తుని బడయ గలవు. పరమానందము ననుభవించగలవు అని శిష్యుని ఊరడించవలయును. ఈ విధముగా "తథా

వదన్తం" ఇత్యాదికముచేత వివేకచూడామణి వివరించిన యర్థమును ఋభు మహర్షులవారిచే వచింపబడిన "నిదాఘ! త్వం కృతార్థోసి". ఇత్యాదికము సూచించుచున్నదని యెరుగవలయును.

భ్రమగణన, తద్భేదన.

అవ॥ భ్రమలయొక్క సంఖ్య, వానినే బోధింతు ననుటయు దెలుపబడుచున్నది.

మూ॥ భ్రమః పంచవిధో భాతి తదేవేహ సముచ్యతే।

పద॥ భ్రమః -పంచవిధః - భాతి - తత్ - ఏవ- ఇహ- సముచ్యతే.

ప్రతి॥ భ్రమః=భ్రాంతి, పంచవిధః=ఐదురకములు గలదియై, భాతి=భాసించుచున్నది, తదేవ = అదియే, ఇహ = ఇచ్చట, సముచ్యతే = లెస్సగా చెప్పబడుచున్నది.

తా॥ భ్రాంతులు ఐదురకములుగా భాసించు చున్నవి. ఆ భ్రాంతులను నీకిచట లెస్సగా అనగా వాని నివృత్తితోగూడ బోధించెదను.

విశే॥ భేదభ్రమ 1, కర్తృత్వభ్రమ 2, సంగభ్రమ 3, వికారభ్రమ 4, జగత్సత్యత్వభ్రమ 5— అని ఆత్మవిషయికములగు భ్రమలు పంచవిధములుగా నున్నవి. ఈ గ్రంథమున నీభ్రాంతుల స్వరూపములు, మఱియు నవి తొలగిపోవు యుపాయములునూ విశదముగా వివరింపబడినవి. ఓమ్.

ఓమ్

సుబోధినీ వ్యాఖ్యా సహితమగు
పంచభ్రమ నివృత్తి నిరూపణము

భే ద భ్ర మ

అవ॥ మొదటిదియగు భేదభ్రమ స్వరూపము చెప్పబడుచున్నది.

మూ॥ జీవేశ్వరౌ భిన్నరూపా వితి ప్రాథమికో భ్రమః ॥

పద॥ జీవేశ్వరౌ - భిన్నరూపౌ - ఇతి - ప్రాథమికః - భ్రమః.

ప్రతి॥ జీవేశ్వరౌ = జీవేశ్వరులు, భిన్నరూపౌ = వేరువేరైన రూపములుగలవారు, ఇతి = ఈ ప్రకారమైన, భ్రమః = భ్రాంతి, ప్రాథమికః = మొదటిది.

తా॥ జీవుడు, ఈశ్వరుడునూ భిన్నభిన్నస్వరూపులు. ఏకస్వరూపముగారు. అనునట్టి భ్రాంతి మొదటిది యగును.

విశే॥ బింబము ఈశ్వరరూపము, ప్రతిబింబము జీవరూపమును నగును. లోకమున బింబప్రతిబింబములు భిన్నభిన్నములుగా గనుపించుచున్నవి. ముఖరూపమగు బింబముకంటె అద్దములో ఆ ముఖప్రతిబింబము వేరుగా గోచరించుచున్నదిగదా! అట్లే ఈశ్వరరూపమగు బింబముకంటె అజ్ఞానమునందు ఆ యీశ్వర ప్రతిబింబమైన జీవరూపము వేరుగానే యున్నది. కనుక జీవుడు, ఈశ్వరుడునూ ఏకరూపముగాజాలరు. వారు భిన్నభిన్నులు; అనునది భ్రాంతియే యగునుసుమా! దీనినే "భేదభ్రమ'' అని యందురు. మరియు 1. జీవేశ్వరభేదము, 2. జీవ పరస్పరభేదము, 3. జీవజడభేదము, 4. జడపరస్పరభేదము, 5. జడేశ్వరభేదము అని యీ భేదభ్రమ యొక్కటియే ఐదు విధములుగా నున్నది.

భేదభ్రమ నివృత్తి

అవ॥ బింబప్రతిబింబ దృష్టాంతముచేత భేదభ్రమ నిరాకరింపబడుచున్నది.

మూ॥ బింబప్రతిబింబ దర్శనేన భేదభ్రమో నివృత్తః ॥

పద॥ బింబప్రతిబింబదర్శనేన—భేదభ్రమః - నివృత్తః.

ప్రతి॥ బింబప్రతిబింబదర్శనేన= బింబప్రతిబింబ ములయొక్క దర్శనముచేత, భేదభ్రమః=భేదభ్రాంతి, నివృత్తః = తొలగిపోయినది.

తా॥ శ్రీ సద్గురుదేవుని సన్నిధిలో బింబప్రతిబింబ ములగూర్చి బాగుగా విచారణజేసి చక్కగా తెలిసి కొనుటచేత జీవుడు వేరు, ఈశ్వరుడు వేరు అనెడి భేదభ్రమ నాకు పూర్తిగా తొలగిపోయినది.

విశే॥ * అద్దమున ముఖముయొక్క ప్రతిబింబము భాసించుచున్నట్లుండును. కాని ఆ ప్రతిబింబము అద్దమున లేదు. మరేమనగా అద్దమును జూచుటకు బయలుదేరిన నేత్రవృత్తి ఆ యద్దమును స్పృశించి దాని వెనుక పూయబడిన పాదరసముచే నెట్టివేయ బడినదై వెనుకకు మరలివచ్చి ముఖము మీదబడి ముఖమునే జూచుచున్నది. కనుక గ్రీవాస్థమై ముఖము కనుపించుచున్నదేగాని దర్పణస్థమై కనుపించుటలేదు. అందుచేత ముఖరూపమగు బింబముతో ప్రతిబింబము అభిన్నముగానే యున్నది. భిన్నముగా లేదు. కాబట్టి

---

* పద్మపాదాచార్యులవారు బ్రహ్మసూత్రభాష్యమునకు "పంచపాదిక" అను పేరుతో నొక వ్యాఖ్యానమును వ్రాసిరి. ఆ పంచపాదికకు శ్రీ ప్రకాశాత్మాచార్యులవారు "వివరణము" అను వ్యాఖ్యానమును రచించిరి. వారినే వివరణాచార్యు లనియూ అందురు. వారి మతానుసారముగా నిచట వ్రాయ బడినది.

సుఖరూపమగు బింబముతో భేదము, విపరీతత, దర్పణస్థితి అను మూడు ప్రతిబింబధర్మములు, వాని యొక్క ప్రతీతిరూపమగు జ్ఞానమునూ, భ్రాంతియే యగును. ఈ ధర్మాదులయొక్క మిథ్యాత్వనిశ్చయ రూపమగు బాధచేత ప్రతిబింబమునకు బింబముతో సదా అభేద నిశ్చయ మేర్పడును.

ఇట్లే శుద్ధ బ్రహ్మరూపము బింబము. ఆ బింబము నకు శుద్ధ బ్రహ్మజ్ఞానరూపమగు దర్పణమునందు జీవ రూప ప్రతిబింబము భాసించును. ఆ జీవరూపమగు ప్రతిబింబము ఈశ్వరరూపమగు బింబముతో సర్వదా అభిన్నమైయుండును. బింబ ప్రతిబింబములకు భేదము లేదని చెప్పబడినదిగదా! అయిననూ మాయా బలమువలన ప్రతీయమానములగు బింబరూపేశ్వరు నితో భేదము, జీవత్వము, అల్పజ్ఞత్వము, అల్పశక్తి మత్త్వము, పరిచ్ఛిన్నత్వము మొదలగు జీవధర్మ ములు, వానియొక్క ప్రతీతిరూపమగు జ్ఞానమునూ

భ్రాంతియే యగును. కనుక ఆ జీవ ధర్మజ్ఞానముల యొక్క మిథ్యాత్వ నిశ్చయరూపమగు బాధవలన జీవరూపమగు ప్రతిబింబమునకు ఈశ్వరరూపమగు బింబముతో సదా అభేద నిశ్చయము సిద్ధించును. కనుకనే "తత్త్వమసి" ఛాం. 6. ఆ బ్రహ్మమే నీవు. ఇత్యాది శ్రుతులు జీవబ్రహ్మభేదమును శాసించినవి. "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి.'' భగ. 13. 3. క్షేత్రజ్ఞుడుగా దోచు జీవుడు నేనే; అని యెరుగుము. అని స్వయముగా శ్రీ భగవంతుడే తనకంటె అన్యముగా జీవుడు లేడని బోధించెను. మఱియు

యథా మృదిఘటోనామ కనకే కుండలాభిధా ।
శుక్తౌ హి రజతఖ్యాతిర్జీవశబ్దస్తథా పరే॥ అప. 60

తా॥ మృత్తికయందు ఘటమను పేరు, కనకమునందు కుండలమను పేరు, శుక్తియందు రజతమను పేరునూ ఎట్లు కల్పితములో, మృత్తిక, కనకము, శుక్తికయునూ మాత్రమే సత్యములో అట్లు బ్రహ్మము

నందు జీవుడను పేరునూ కల్పితమేయగును. బ్రహ్మము మాత్రమే సత్యమగును. కనుక అజ్ఞానావస్థయందు ప్రతీయమానమగు జీవేశ్వరభేదము నామమాత్రమే యగును. అనగా బ్రహ్మమే జీవరూపముగా దోచినది; సత్యముగా జీవుడను మరియొక వ్యక్తి లేనేలేదని భావము.

ద్రష్టృదర్శన దృశ్యాది భావ శూన్యైకవస్తుని
నిర్వికారే నిరాకారే నిర్విశేషే భిదాకుతః॥ వివేక 401

తా॥ చూచువాడు, చూపు, చూడదగినది మొదలైనవన్నియు అవిద్యావస్థయందు సత్యములైనవివలె తోచును. విద్యావస్థయందు అవిద్య నశించిపోవుటవలన ఆ యజ్ఞాన మూలకములగు ద్రష్ట, దర్శనము, దృశ్యము మొదలగునవియునూ లేకపోవుటనుబట్టి ద్రష్టాది భావశూన్యమై, ఏకమై, జన్మాది వికారరహితమై, అవయవ సంస్థానరూపమగు ఆకా

రము లేనిదై, గుణగుణిభావము అవయవావయ విభావము జాతివ్యక్తిభావము ఇత్యాది విశేషము లెవ్వియు లేనట్టి కేవల పరబ్రహ్మమునందు జీవేశ్వ రాది భేద మెక్కడిది? లేనేలేదు. అంతయు బ్రహ్మమే; అని భావము.

కల్పార్ణవ ఇవాత్యంత పరిపూర్ణైకవస్తుని ।
నిర్వికారే నిరాకారే నిర్విశేషే భిదాకుతః॥ వివేక 402

తా॥ ప్రలయకాలమున నాల్గు సముద్రములు మిళితములై జగత్తునంతటిని జలమయముగా జేసి వైచును. అప్పుడు భూభాగము కొంచెమైననూ మిగిలియుండదు. ఎటుబట్టిననూ జలమే. ఆ విధ ముగా సర్వత్ర పరిపూర్ణమై, అద్వితీయమై, వికారా కార రహితమై, విశేషశూన్యమైన అఖండ పర బ్రహ్మమునందు జీవేశ్వరాది భేద మెక్కడిది? ఈష న్మాత్రమైననూ లేనేలేదు. అంతయు పరిపూర్ణ పర

బ్రహ్మమే; అని శ్రీ శంకరభగవత్పాదులునూ వచించిరి. ఈరీతిగా బింబ ప్రతిబింబ దృష్టాంతాదులచే విచారణ జేసి వాని యథార్థము నరసినయెడల జీవేశ్వరుల కభేదమే సిద్ధించునని, దానిచే భేదభ్రాంతి తొలగిపోవుననియునూ యెరుగవలయును.

మఱియు అజ్ఞానకల్పితమగు జీవేశ్వరభేదము బింబ ప్రతిబింబ విచారణజన్య జ్ఞానముచే నజ్ఞానము తొలగిపోవుటవలన తొలగినదై తక్కిన భేదముల నన్నిటిని తొలగించినది. అనగా పూర్వోక్తరీతిగా జీవేశ్వర భేదము లేకపోవుటవలన వేరుగా జీవుడు లేడని సిద్ధించినది. అందుచేత తదాభాసజీవులునూ లేరుకదా! కనుకనే రెండవదియగు జీవ పరస్పర భేదముగాని, మూడవదియగు జీవజడ భేదముగాని సిద్ధించజాలవు. మఱియు ఉక్తరీతిగా అజ్ఞానము విచారణ జన్య జ్ఞానముచే నష్టమగుటవలన కారణమగు

అజ్ఞానము లేకపోవుటనుబట్టి కార్యమగు జడప్రపంచమునూ లేదనియే సిద్ధించినది. కాబట్టి జడపదార్థములే లేవు గనుక నాల్గవదియగు జడపరస్పర భేదముగాని, ఐదవదియగు జడేశ్వర భేదముగాని లేదనియే సిద్ధించినదనియునూ తెలియవలయును. ఓమ్.

ఓమ్

సుబోధినీ వ్యాఖ్యా సహితమగు పంచభ్రమ నివృత్తి నిరూపణము

కర్తృత్వ భ్రమ

అవ॥ రెండవదియగు కర్తృత్వభ్రమయొక్క స్వరూపము చెప్పబడుచున్నది.

మూ॥ ఆత్మనిష్ఠం కర్తృగుణం వాస్తవం వా ద్వితీయకః ।

పద॥ ఆత్మనిష్ఠం - కర్తృగుణం - వాస్తవం - వా - ద్వితీయకః.

ప్రతి॥ ఆత్మనిష్ఠం = ఆత్మయందు భాసించుచున్న, కర్తృగుణం = అంతఃకరణ ధర్మమైన కర్తృత్వాదికము, వాస్తవం = సత్యమైనది, వా = ఇట్టిది, ద్వితీయకః = రెండవదియైన, (భ్రమః = భ్రాంతి)

తా॥ నేను కర్తను, నేను భోక్తను అని యీ రీతిగా ఆత్మయందు ప్రతీయమానము లగుచున్న అంతఃకరణముయొక్క కర్తృత్వము, భోక్తృత్వము మొదలగు ధర్మములు సత్యములు, అనగా ఆత్మ సత్యములైన కర్తృత్వాదుల గలిగియున్నది; అనునది రెండవ భ్రాంతి యగును.

విశే॥ రక్తవస్త్రయుక్తమగు శుద్ధస్ఫటికమునందు రక్తవర్ణము గలదు. దానిని కన్నులార గాంచుచున్నాముకదా! కనుక నది సత్యమే యగును. అట్లే అంతఃకరణ విశిష్టమగు ఆత్మయందు కర్తృత్వ, భోక్తృత్వాదులు గలవు. నేను చేయుచున్నాను; నేను అనుభవించుచున్నాను; అని యీ విధముగా అందరికిని అనుభూతి గలుగుచున్నదిగదా! కాబట్టి అవియునూ సత్యములే యగును. అనునదియునూ భ్రాంతియే యగును సుమా! దీనినే "కర్తృత్వ భ్రమ" అని యందురు.

కర్తృత్వ భ్రమ నివృత్తి

అవ॥ స్ఫటిక లోహిత దృష్టాంతముచేత కర్తృత్వ భ్రమ నిరసింపబడుచున్నది.

మూ॥ స్ఫటిక లోహిత దర్శనేన పారమార్థిక కర్తృత్వ భ్రమో నివృత్తః ॥

పద॥ స్ఫటిక లోహిత దర్శనేన - పారమార్థిక కర్తృత్వ భ్రమః - నివృత్తః.

ప్రతి॥ స్ఫటిక లోహిత దర్శనేన=స్ఫటికమునందు లోహితము అనగా యెఱుపురంగుయొక్క దర్శనము చేత, (ఆత్మని=ఆత్మయందు) పారమార్థిక కర్తృత్వ భ్రమః = సత్యమైన కర్తృత్వాదికముయొక్క భ్రాంతి, నివృత్తః = నివృత్తమైనది.

తా॥ శుద్ధ స్ఫటికమునందలి యెఱుపురంగును గూర్చి బాగుగా విచారణ జేసి చక్కగా తెలిసి కొనుటచేత శుద్ధాత్మయందు ప్రతీయమానములగు

కర్తృత్వ. భోక్తృత్వాదులు సత్యములను భ్రాంతి నాకు పూర్తిగా తొలగిపోయినది.

విశే॥ ఎఱ్ఱనివస్త్రము యెఱుపురంగును, శుద్ధ స్ఫటికము తెలుపురంగును కలిగియుండునుకదా! అయిననూ ఎఱ్ఱనివస్త్రముమీద శుద్ధమగు స్ఫటికము నుంచినయెడల సంయోగ సంబంధముచేత ఎఱుపు రంగు శుద్ధ స్ఫటికమునందు భాసించును. అందుచేత స్ఫటికము యెఱుపురంగు గలదివలె తోచును. కాని ఆ రంగు యథార్థముగా వస్త్రమునందు గలదు గనుక వస్త్రధర్మమే యగును. స్ఫటికమునందు లేదు గనుక స్ఫటికధర్మము గానేరదు. కాబట్టియే వస్త్ర మును, స్ఫటికమును వేరుజేసి దూరముగా నుంచిన యెడల స్ఫటికమున నా ధర్మము భాసించుటయునూ లేదు సుమా! అందుచేత రక్తవస్త్రముమీద నున్న పుడుకూడ సత్యమగు యెఱుపురంగు లేనేలేదు. మరేమన రక్తవస్త్ర సంబంధముచేత కల్పితమైనదే

తోచినదని యెఱుగవలయును. కన్నులకు కనుపించి నంత మాత్రమున ప్రతి పదార్థము సత్యమగునని యన దగదు. స్వప్నపదార్థములు రజ్జు సర్పాదులు, దూరస్థ పర్వతమునందు అర గజము, గజము పొడవున దోచు నట్టి వృక్షములునూ కనుపించుచునేయున్నవి కదా! అయిననూ వాని నెవ్వరునూ సత్యములని యంగీక రించుట లేదు సుమా! కనుక రక్తవస్త్ర సంయుక్త మగు శుద్ధస్ఫటికమునందు సత్యమగు రక్తవర్ణము కలదనుట భ్రాంతియే యగునని యెరుగవలయును.

ఈ విధముగానే అంతఃకరణము కర్తృత్వము, భోక్తృత్వము మొదలగు ధర్మములు గలిగియున్నది. ఆత్మ ఏ ధర్మమునూ లేనివాడై యున్నాడు. కనుకనే పరిశుద్ధుడు. అయిననూ ఆత్మాంతఃకరణముల యొక్క తాదాత్మ్య సంబంధముచేత అంతఃకరణము యొక్క కర్తృత్వాదులు ఆత్మయందు భాసించును. అందుచేత ఆత్మ సత్యములైన కర్తృత్వాదులు గల

వాడువలె తోచును. కాని ఆ కర్తృత్వాదులు వస్తుతః అంతఃకరణమునందు గలవుగనుక అంతఃకరణ ధర్మములే యగును. ఎప్పుడునూ ఆత్మయందు లేవు గనుక ఆత్మధర్మములు గానేరవు. కాబట్టియే సుషుప్తియందు అంతఃకరణము స్వకారణమగు అజ్ఞానము నందు లయమైనపుడు ఆత్మయందు ఆ కర్తృత్వాదులు భాసించుటయునూ లేదుసుమా! కావున ఆత్మాంతఃకరణములయొక్క తాదాత్మ్యమునందునూ ఆత్మయందు సత్యములైన కర్తృత్వాదులు లేనేలేవు. మరేమన అంతఃకరణ తాదాత్మ్యముచేత కల్పితములైనవియే ప్రతీయమానము లగుచుండునని యెఱుగవలయును. చేయుచున్నాను, అనుభవించుచున్నాను అని అనుభూతి కలుగుచున్నంత మాత్రమున ఆత్మయందు సత్యములగు కర్తృత్వాదులు గలవని యనరాదు. స్వప్నదృష్టాంత సలిలము సర్వాశంకాపంక ప్రక్షాలన మొనరింప సంసిద్ధమైయున్నదని గ్రహించ

వలయును. మఱియు "కామస్సంకల్పో విచికిత్సా" ఇత్యాది శ్రుతి కామాదు లంతఃకరణ ధర్మములగునని శాసించుచూ ప్రకారార్థవాచకమగు ఇతిశబ్దముచేత కర్తృత్వాదులునూ అంతఃకరణ ధర్మములే యగునని బోధించినది, కనుకనే ఇతరాచార్యాదులునూ కర్తృత్వాదు లంతఃకరణధర్మములేయగునని స్పష్టీకరించిరి.

"అజ్ఞానా న్మానసోపాధేః కర్తృత్వాదీనిచాత్మని ।
కల్ప్యంతేంబు గతే చంద్రే చలనాదిర్యథాంభసః ॥ "

ఆ. బో.

తా॥ మందమతులు జలముయొక్క చలనాది ధర్మములను జలమునందలి చంద్ర ప్రతిబింబమునందు కల్పించి జలము చలించుచుండగా ఆ చంద్ర ప్రతిబింబమే చలించుచున్నదందురు. అట్లే ఆత్మానాత్మ వివేకజ్ఞానము లేనివారు అజ్ఞానమువలన మనస్సు అనగా అంతఃకరణరూపమగు ఉపాధియొక్క కర్తృత్వాది ధర్మములను ఆత్మయందు కల్పనజేసి అంతః

కరణము కర్తృత్వాదులు గలిగియుండగా ఆత్మయే కర్తృత్వ భోక్తృత్వాదికముల గలిగియున్నాడని పలుకుదురు. అయిననూ అవి అంతఃకరణ ధర్మములే యగును; కాని ఆత్మ ధర్మము లెప్పుడునూ గానేరవు.

ఇట్లు సోదాహరణముగా కర్తృత్వాదు లంతఃకరణ ధర్మములగునని చెప్పి మరల అన్వయ వ్యతిరేకములచే దృఢపరచుచున్నారు.

రాగేచ్ఛా సుఖదుఃఖాది బుద్ధౌ సత్యాం ప్రవర్తతే।
సుషుప్తౌ నాస్తి తన్నాశే తస్మాద్బుద్ధేస్తునాత్మనః ॥

ఆ. బో.

తా॥ అనురాగము, సుఖము, దుఃఖము, కర్తృత్వము, భోక్తృత్వము మొదలగునవి జాగ్రత్స్వప్నములయందు బుద్ధి అనగా అంతఃకరణ ముండుటవలన ఉంటున్నవి. సుషుప్తియందు అంతఃకరణము లయించి పోవుటవలన లేకున్నవి. కనుక అన్వయ వ్యతిరేకములచే నాకర్తృత్వానురాగాదులు అంతఃకరణాధర్మము

ంగునేగాని ఆత్మధర్మము లెంతమాత్రమునూ కానేరవు.

అకర్తాహ మభోక్తాహ మవికారోఽహ మక్రియః-
శుద్ధబోధస్వరూపోఽహం కేవలోఽహం సదాశివః ॥
వివేక. 491

తా॥ శ్రీ సద్గురు దేవునిచే ప్రబోధింపబడిన శిష్యుడు ఆ గురు ప్రసాదముచే లబ్ధమైన స్వానుభవమును ప్రకటించుచున్నాడు - ఇది బాగుగా గమనించదగినది. బ్రహ్మాత్మస్వరూపుడనైన నేను చేయువాడనుగాను. అనుభవించువాడనుగాను. నేను జన్మాది వికారములు లేనివాడను. నిర్వ్యాపారుడను. పరిశుద్ధబోధస్వరూపుడను. అద్వితీయుడను. ఎప్పుడునూ పరమశివస్వరూపుడను.

కర్తాపి వా కారయితాపి నాహం
భోక్తాపి వా భోజయితాపి నాహమ్।

ద్రష్టాపి వా దర్శయితాపి నాహం
సోఽహం స్వయంజ్యోతిరనీదృగాత్మా ॥ వివేక. 508

తా॥ నేను చేయువాడనుగాని, చేయించువాడను గాని కాను. అనుభవించువాడనుగాని, అనుభవింప జేయువాడనుగాని కాను. మఱియు చూచువాడను గాని, చూపించువాడనుగాని కాను. నేను ఈ సమస్త ధర్మవర్జితుడు స్వయంప్రకాశ స్వరూపుడును నగు పరబ్రహ్మను. ఇచట కారయితృత్వము, భోజయితృత్వము మొదలగు ధర్మములుగూడ ఆత్మకు లేవని చెప్పబడినది గ్రహించదగినది.

ఈ విధముగా శుద్ధ స్ఫటికమునందు తోచు లోహితమును మొదలగువానివిగూర్చి విచారణ జేసి చక్కగా దెలిసికొనుటచేత ఆత్మయందు భాసించు కర్తృత్వాదులు పారమార్థికములను భ్రాంతి తొలగి పోవునని గమనించదగినది. ఓమ్.

ఓమ్

సుబోధినీ వ్యాఖ్యా సహితమగు
పంచభ్రమ నివృత్తి నిరూపణము

❖❖❖❖❖❖

సంగభ్రమ

అవ॥ మూడవదియగు సంగభ్రమయొక్క స్వరూపము చెప్పబడుచున్నది.

మూ॥ శరీరత్రయ సంయుక్తో జీవస్సంగీ తృతీయకః ।

పద॥ శరీరత్రయ సంయుక్తః - జీవః - సంగీ - తృతీయకః.

ప్రతి॥ శరీరత్రయసంయుక్తః = మూడు దేహములతోగూడిన, జీవః = జీవుడు, సంగీ = సంగము కలవాడు. (ఇతి = ఈ విధమైన, భ్రమః = భ్రాంతి) తృతీయకః = మూడవది.

తా॥ జీవాత్మ స్థూలసూక్ష్మకారణ శరీరములతో సంబంధించియున్నాడు. కనుక సంగియగును. అను నది మూడవభ్రాంతి యనబరగును.

విశే॥ ఘట సంబంధియగు ఆకాశమును ఘట ధర్మములైన ఉత్పత్త్యాదులు, గమనా గమనాదు లునూ స్పృశించుచున్నటుల, దేహ సంబంధియగు జీవాత్మను దేహధర్మములగు జనన మరణాదులు, గమనా గమనాదులును స్పృశించును. మఱియు దేహమునందు నేనను అభిమాన ముండుటవలన దేహముతో అహంతా సంబంధము, ఆ దేహమునకు సంబంధించిన గృహాదులయందు నావి యను మమ కార ముండుటవలన వానితో మమతా సంబంధ మునూ ఆత్మకు కలదు. కాబట్టి జీవాత్మ సంగి యగును; అనునదియునూ భ్రాంతియే యగును. దీనినే 'సంగభ్రమ' అని యందురు.

సంగభ్రమ నివృత్తి

అవ॥ ఘట మఠాకాశ దృష్టాంతములచేత సంగభ్రమ తొలగింపబడుచున్నది.

మూ॥ ఘటమఠాకాశ దర్శనేన సంగీతి భ్రమో నివృత్తః।

పద॥ ఘటమఠాకాశదర్శనేన - సంగి - ఇతి - భ్రమః -నివృత్తః.

ప్రతి॥ ఘటమఠాకాశదర్శనేన = ఘటాకాశ, మఠాకాశములయొక్క దర్శనముచేత, జీవః = జీవాత్మ, సంగీ = శరీరత్రయ సంబంధము కలవాడు, ఇతి = ఈ ప్రకారమైన. భ్రమః = భ్రాంతి, నివృత్తః = నివృత్తమైనది.

తా॥ ఘటాకాశమును, మఱియు మఠాకాశమునుగూర్చి బాగుగావిచారణ జేయుటచేత దేహత్రయముతో గూడి భాసించుచున్నందువలన ఆత్మ ఆ దేహ ధర్మములగు జననమరణాదులయొక్క సంబం

ధము, అహంతాది సంబంధములునూ గలిగి సంగి యగుననెడి భ్రాంతి నాకు సంపూర్ణముగా తొలగి పోయినది.

విశే॥ ఘటము (కడవ) ఉపాధిగా గల ఆకాశమును ఘటాకాశమనియు, మఠము ఉపాధిగా గల ఆకాశమును మఠాకాశమనియునూ చెప్పుదురు. ఇందేయొకదానినిగూర్చి విచారించిననూ సామ్యమునుబట్టి రెండిటిని విచారించినట్లే యగును. పై భ్రాంతియూ నివర్తించగలదు. కనుక ప్రస్తుతము ఘటాకాశమును స్వీకరించి విచారింతము. ఘటోపాధికమగు ఆకాశము ఘటముతోకూడ భాసించుచుండును. అందులో ఘటమునందు ఉత్పత్తి వినాశములు, గమనాగమనములు మొదలగు అనేకధర్మములు కలవు. అయిననూ వానిలో నొక్కటియునూ ఘటాకాశమును స్పృశించనేరదు. ఆకాశము

భూతము లన్నిటికంటె సూక్ష్మమైనదికదా! అందు వలన ఆకాశము అసంగమే యగును.

ఘట సంవృతమాకాశం నీయమానే ఘటే యథా।
ఘటో నీయేత నాకాశం॥ అ. బిం. ఉ.

తా॥ ఆకాశము ఘటముచే నావరింపబడిననూ ఘటము నిటునటు తీసుకపోయినయెడల ఘటము తీసుకపోబడునేగాని ఆకాశము తీసుకపోబడదు. అనగా ఘటముయొక్క గమనాగమనాదులు ఆకాశము నంటనేరవు. ఇట్లే ఘటోత్పత్తి వినాశాదులునూ ఘటాకాశము నంటజాలవని గ్రహించవలయును. అందుచేత ఘటముతోకూడ తోచుటవలన ఘటాకాశము ఘట ధర్మములతో సంబంధము గలిగి యున్నదనుట భ్రాంతి మాత్రమేయగును. మఠాకాశమునుగూడ ఇట్లే గమనించవలయును.

ఈ విధముగానే శరీరత్రయముతో గూడి యున్ననూ కూటస్థుడగు ఈ జీవాత్మ అసంగుడే

యగును. అనగా జీవుడు దేహాది సంఘాతరూపమగు ఉపాధి కలవాడు. కనుక దేహాది సంఘాతముతో కూడ భాసించుచుండును. ఆ దేహాది సంఘాతమున జనన మరణాదు లనేకములు గలవు. కాని వానిలో నొక్కటియైననూ ఆత్మను తాకుటకు సమర్థముగాదు. కారణమేమన సంఘాతము దృశ్యము, ఆత్మ ద్రష్టయు నగును. దృశ్యమునకు, ద్రష్టకునూ అభేదము కుదరదు. ఘటద్రష్టకు దృశ్యమగు ఘటముతో అభేదము లేదుగదా! కాబట్టి దృశ్యమగు దేహాది సంఘాతము కంటె ద్రష్టయగు నాత్మ విలక్షణుడై యుండును. అందుచేత ఆత్మ దేహాది సంఘాతరూపుడు గాడు. కనుకనే ఆ సంఘాత ధర్మములైన జననాదులు ఆత్మ నంటవు. మఱియు ఉక్తరీతిగా ఆత్మ దేహాది సంఘాత రూపుడు కాడు గాబట్టియే ఆత్మకు దేహాది సంఘాత ముతో అహంకారరూపమగు సంబంధమునూ లేదు. ఈ కారణముచే దేహాది సంఘాతము ఆత్మకు సంబం

ధించినది గానేరదు. మరేమన ఆకాశాదిపంచమహా భూతములకు సంబంధించినదే యగును. ఇందుచేతనే ఆత్మకు దేహాది సంఘాతముతో, మఱియు ఆ సంఘాతమునకు సంబంధించిన గృహారామాదులతోడను మమతారూపమగు సంబంధమునూ లేదు. కనుక ఆత్మ సంగరహితుడు. "అసంగోహ్యాయం పురుషః" "తద్వజ్జీవో న భోపమః" శరీరమను పురమున విరాజిల్లుచున్ననూ ఈ యాత్మ ఘటాకాశమువలె అసంగుడు, అనగా శరీరధర్మములగు ఉత్పత్తి వినాశాదుల సంబంధముగాని, ఆ శరీరముతో మరియు దానికి సంబంధించిన గృహాదులతో అహంతా మమతా రూపములగు సంబంధములుగాని లేనివాడని శ్రుతులు శాసించినవి. మఱియు

"న సాక్షిణం సాక్ష్యధర్మాః సంస్పృశంతి విలక్షణమ్ ।
అవికార ముదాసీనం గృహధర్మాః ప్రదీపవత్ ॥

వివేక॥ 506

తా॥ మృణ్మయత్వము, సుధామయత్వము, దారుమయత్వము ఇత్యాదులైన గృహధర్మములు గృహమును ప్రకాశింపజేయుప్రదీపమునెట్లు స్పృశింపజాలవో, అట్లే సాక్ష్యములైన స్థూల సూక్ష్మ కారణ శరీరములయొక్క ధర్మములు అనగా స్థూలదేహ ధర్మములైన జనన మరణాదులు, సూక్ష్మదేహము యొక్క జ్ఞానేంద్రియ ధర్మములైన శబ్దాదులు మఱియు బధిరత్వ పటుత్వ మందత్వాదులు కర్మేంద్రియ ధర్మములైన వచనాదులు మఱియు మూకత్వాదులు, ప్రాణధర్మములైన క్షుత్పిపాసాదులు మఱియు తృప్త్యాదులు, అంతఃకరణ ధర్మములైన సంకల్ప వికల్ప, కర్తృత్వ భోక్తృత్వ, చింతనాహంకారాదులు మఱియు పుణ్య పాప సుఖ దుఃఖాదులు, కారణదేహ ధర్మములైన సత్వరజస్తమోగుణాదులును, ఈ శరీరత్రయముతో మరియు దీనికి సంబంధించిన గృహాదులతో అహంతా మమతలునూ ఈ

మూడు దేహముల ప్రకాశింపజేయుచూ స్వయం ప్రకాశమానుడై ఆ దేహములకు సాక్షియై వాని కంటె విలక్షణుడై తటస్థుడైన ఆత్మను స్పృశింప జాలవు.

రవే ర్యథా కర్మణి సాక్షిభావో
వహ్నే ర్యథా వాయసి దాహకత్వమ్ ।
రజ్జో ర్యథారోపిత వస్తుసంగః
తథైవ కూటస్థ చిదాత్మనో మే॥ వివేక. 507.

తా॥ ప్రబుద్ధుడైన శిష్యుడు తనయొక్క అసంగత్వానుభవమును ప్రదర్శించుచున్నాడు. సకలప్రాణి కర్మలతో సంబంధములేని సూర్యునికివలె నిర్వికార చిద్రూపుడనై సర్వకర్మాసంగుడనైన నాకు సకల ప్రాణి కర్మలయొక్క సాక్షిత్వము కలదు. ఇట్లే అయస్సు (ఇనుము) దహించుచున్నదని అగ్నియొక్క దాహకత్వము అయస్సునందువలె నేను చేయుచున్నానని అంతఃకరణముయొక్క కర్తృత్వము

నిర్వికార చిద్రూపుడనైన నాయందు కలదు. ఈ విధముగానే రజ్జువునకు కల్పితములైన సర్ప దండ జలధారాదుల తోటిసంగమువలె కూటస్థ చిద్రూపుడ నైన నాకు కల్పిత దేహాదులతో సంబంధము కలదు. అనగా నిర్వికార చైతన్య పరబ్రహ్మనైన నేను సూర్యునివలె, అయస్సువలె, రజ్జువు వలె అసంగుడ నని తాత్పర్యము. ఇట్లు శ్రీమదాచార్య చరణులు వచించిరి. కనుక శరీరత్రయముతో సంగము గలిగి ఆత్మ సంగియగు ననుట భ్రాంతియే యగును. ఈ రీతిగా ఘట మఠాకాశ దృష్టాంతాదులచే విచారణ చేసినయెడల సంగభ్రమ నిరాకరింపబడునని యెరుగ వలయును. ఓమ్.

ఓమ్

సుబోధినీ వ్యాఖ్యా సహితమగు

పంచభ్రమ నివృత్తి నిరూపణము

వికారభ్రమ

అవ॥ నాల్గవదియగు వికారభ్రమయొక్క స్వరూపము చెప్పబడుచున్నది.

మూ॥ జగత్కారణరూపస్య వికారిత్వం చతుర్థకః ।

పద॥ జగత్కారణరూపస్య - వికారిత్వం — చతుర్థకః.

ప్రతి॥ జగత్కారణరూపస్య = జగత్కారణరూపమైన బ్రహ్మమునకు, వికారిత్వం = వికారము గలిగియుండుట, చతుర్థకః = నాల్గవదియగు. (భ్రమః - భ్రాంతి.)

తా॥ చరాచరాత్మకమగు సమస్తజగత్తునకు బ్రహ్మ

కారణమైనది. కనుక వికారము కలది. అనునది నాల్గవ భ్రాంతి యగును.

విశే॥ దధికి దుగ్ధము కారణమైనటుల ప్రపంచము నకు బ్రహ్మము కారణమైయున్నది. కనుకనే దుగ్ధ వికారము దధియైనటుల బ్రహ్మ వికారము ప్రపంచ మగును. అందుచేత దుగ్ధమువలె బ్రహ్మము వికారము గలిగియున్నది; అనునదియునూ భ్రాంతియే యగును. దీనినే 'వికారభ్రమ' అని యందురు.

వి కా ర భ్ర మ ని వృ త్తి

అవ॥ రజ్జు సర్పదర్శనముచే వికారభ్రమ పోగొట్ట బడుచున్నది.

మూ॥ రజ్జుసర్పదర్శనేన వికారిత్వభ్రమో నివృత్తః॥

పద॥ రజ్జుసర్పదర్శనేన - వికారిత్వభ్రమః - నివృత్తః.

ప్రతి॥ రజ్జుసర్పదర్శనేన = రజ్జుసర్పముయొక్క దర్శనముచేత, వికారిత్వభ్రమః = వికారభ్రమ, నివృత్తః = తొలగిపోయినది.

తా॥ రజ్జువునందు కల్పితమగు సర్పముయొక్క విచారణ చేసి బాగుగా తెలిసికొనుటచేత జగత్కారణమగు బ్రహ్మము దధికారణమగు దుగ్ధమువలె వికారము గలిగియున్నది; అను నా భ్రాంతి మటుమాయమైపోయినది.

విశే॥ సంధ్యాకాలమున అంధకారము మంద (స్వల్ప) ముగా నుండును. ఆ మందాంధకారమునందు పడియున్న రజ్జువును (త్రాటిని) జూచుటకొఱకు నేత్రగోలకమునుండి చక్షురింద్రియ ద్వారమున బయలుదేరి అంతఃకరణవృత్తి రజ్జుదేశమునకు వెళ్ళును. అయిననూ ఆ యంతఃకరణవృత్తి అంధకారాది దోషముల వలన రజ్జువుయొక్క సమానాకార [illegible]మును పొందజాలదు. అందుచేత ఆ వృత్తివలన రజ్జువు

యొక్క ఆవరణమునకు భంగము (నాశము) కలుగదు. అప్పుడు రజ్జువు ఉపాధిగాగల చైతన్యము నాశ్రయించి యున్న తూలావిద్య అనగా రజ్జ్వాది లౌకిక పదార్థములు ఉపాధులుగా గల చైతన్యము నావరించునట్టి యజ్ఞానము క్షోభను బొంది సర్పరూపమగు వికారమును బొందును. ఆ సర్పము దుగ్ధము యొక్క పరిణామము అనగా వికారము దధియైనటుల రజ్జూపాధిక చైతన్యావిద్యయొక్క వికారమగును. మఱియు రజ్జూపాధిక చైతన్యముయొక్క వివర్తమును నగును. అంతేగాని రజ్జూపాధిక చైతన్యము యొక్క వికారము గాదు. అట్టి చైతన్య వికారమనుట భ్రాంతియే యగును.

ఈ విధముగానే బ్రహ్మ చైతన్యము నాశ్రయించి యుండు మూలావిద్య అనగా శుద్ధబ్రహ్మకు ఆవరకమగునట్టి యజ్ఞానము జీవులయొక్క ప్రారబ్ధాది నిమిత్తమువలన సంక్షుభితమై (కార్యోన్ముఖమై) పరి

ణామమును అనగా తనయొక్క పూర్వరూపమును విడిచిపెట్టి జడచేతనా (చిదాభాసా)త్మకమైన (ప్రపంచ రూపమగు వికారమును బొందినది. కనుక నీ (ప్రపంచము మూలావిద్యయొక్క వికారమైయున్నది. అంతేగాని (బహ్మచైతన్యముయొక్క వికారము గాజాలదు. (బహ్మచైతన్యము (ప్రపంచమునకు అధిష్ఠానమైయున్నది. అనగా తాను నిర్వికార స్వరూపముతో నుండియు అవిద్యా వికారమగు కల్పిత (ప్రపంచమునకు ఆ(శయమై యున్నదని యర్థము. కనుకనే (బహ్మచైతన్యము యీ జగత్తునకు వివర్తోపాదాన కారణమనియును జెప్పబడును. ఇట్లు వివర్తోపాదాన కారణమైన (బహ్మమునకు జగత్తు వివర్తమేయగును. వివర్తమనగాఅధిష్ఠాన సత్తకంటె అన్యసత్తగలదియై, అధిష్ఠాన స్వరూపముకంటె అన్యాకారము గలదియని యర్థము. అందుచేత పారమార్థికసత్తగల సచ్చిదానంద స్వరూపమైన (బహ్మముకంటె అన్యమైన వ్యావ

హారికసత్తగల అసజ్జడదుఃఖస్వరూపమైన ప్రపంచము ఆ జగత్కారణమగు బ్రహ్మముయొక్క వివర్త మగునేగాని వికారమెన్నటికిని గానేరదు. వికార మనుట భ్రాంతియే యగును. "నాయం కుతశ్చిన్న బభూవ కశ్చిత్" క. ఉ. 1.2–18. ఈ పరబ్రహ్మ రూపమగు పరమాత్మ ఒకదానినుండి పుట్టలేదు. అట్టి పరమాత్మనుండి యొకానొకటియునూ జనించలేదు. కనుక నీ బ్రహ్మవస్తువు అవికారము, అవికారియును నగునని భావము. దుగ్ధము స్వీయమగు రూపమును విడిచి అన్యమగు దధిరూపమును బొందుచున్నది గనుక దుగ్ధవికారము దధి, దధిరూపవికారము గలది దుగ్ధము నగుచున్నది. బ్రహ్మము స్వస్వరూప పరి త్యాగము చేయకనే అవిద్యా వికారమగు ప్రపంచము నకు ఆశ్రయ (అధిష్ఠాన) మాత్రముచే కారణమగు చున్నది. కావున జగత్తు బ్రహ్మవికారముగాదు. కావుననే బ్రహ్మవికారియునూ గాదు. మఱియు నీ

బ్రహ్మ జగద్వికారము కలది కాకపోవుట మాత్రము చేత వికార రహితమైనదేగాదు మరేమన జన్మాది సర్వవికార శూన్యమైనది యగుటచేతనూ వికార రహితమైనదని యెఱుగవలయును.

న జాయతే మ్రియతేవాకదాచిన్నాయం
భూత్వా భవితావాన భూయః ।
అజో నిత్యశ్శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥ భ. 2_20

తా॥ ఆత్మస్వరూపమగు నీ బ్రహ్మ ఉత్పత్తి వినాశములు లేనిది. ఏ కాలమునందునూ ముందు లేకుండి మరల కలుగబోవునదికాదు. అందుచేత జననము లేనిది గనుక అజమనబడును. మఱియు నీ బ్రహ్మ ముందుండి ఒకానొక కాలమున లేకపోవునదియునూ కాదు. ఆ కారణముచే మరణము లేనిది యగును గనుక నిత్యమనబడును. ఆద్యంత వికారములైన

జనన మరణముల నిషేధముచేత మధ్యయందుండు
అస్తిత్వము, వృద్ధి, విపరిణామము, అపక్షయము
అనువానియొక్క నిషేధమునూ సిద్ధించుచున్నది.
అయిననూ శాశ్వతమని అపక్షయము, పురాణమని
వృద్ధి నిషేధింపబడుచూ ఉపలక్షణముచేత అనుక్తము
లగు గమనా గమనాది వికారములుగూడ నిషేధింప
బడినవని యెఱుగవలయును. ఇట్లు చెప్పుటచేత
బ్రహ్మము సర్వవికారశూన్యమైనదని తాత్పర్యము
సిద్ధించినది. కనుకనే శరీరాదికమగు జగత్తు ఖడ్గము
మొదలగు నాయుధములచే ఛేదింపబడుచున్ననూ
ఆ శరీరాది జగదంతర్భాగమందున్న బ్రహ్మము ఆకా
శమువలె ఛేదింపబడదు. అనగా శరీరాది జగత్సంబం
ధములగు నెట్టి వికారములునూ బ్రహ్మకు లేనేలేవని
తాత్పర్యము. అందుచేత నిచట దుగ్ధదృష్టాంతము
సమీచీనము గాజాలదు. పూర్వోక్తరీతిగా రజ్జు సర్ప
దృష్టాంత పూర్వకముగా విచారణ జేసినయెడల జగ

త్కారణమైన బ్రహ్మము దధికారణమైన దుగ్ధము వలె వికారము గలది యగునను భ్రాంతి తిరోహిత మగును. ఈ విధముగా వికారభ్రమ నివృత్తమగునని తెలియవలయును.

ఇచట నొక విశేషము గలదు. అనగా మూల గ్రంథమున వికారభ్రమ నివృత్తికి "కనక రుచక దర్శనేన వికారిత్వ భ్రమో నివృత్తః" అని దుగ్ధ దధివంటి కనక రుచక దృష్టాంతము కనుపించుచున్నది. రుచకము (ఆభరణము) కనక వికారము. కనుక నీ దృష్టాంతము ఇచట జనసామాన్యమునకు సుబోధకమగు నటుల వికారభ్రమను నివర్తింపజేయుటకు సముచితముగా లేదనియే గాబోలు శ్రీ బ్రహ్మనిష్ఠ పండిత పీతాంబర శాస్త్రులవారు తమచే రచింపబడిన విచార చంద్రోదయము యొక్క షష్ఠకలయందు ఇతర మూల గ్రంథమును యథాతథముగానే గ్రహించి చతుర్థ పంచమ భ్రమ నివృత్తి దృష్టాంతముల మాత్రము

మార్చివైచిరి. అనగా వికారభ్రమ నివృత్తికి రజ్జు సర్ప దృష్టాంతమును. జగత్సత్యత్వభ్రమ నివృత్తికి కనక రుచక దృష్టాంతమును గైకొనిరి. మఱియు మహాత్ములు మహావిద్వాంసులును నగు శ్రీ వాసుదేవ యతీంద్రులు స్వవిరచితమగు వాసుదేవ మననమున శ్రీ శాస్త్రిలవారివలెనేవికారభ్రమనివృత్తికిరజ్జుసర్ప దృష్టాంతమునే గ్రహించి పంచమమగు జగత్సత్యత్వ భ్రమ నివృత్తికి గంధర్వనగర దృష్టాంతమును స్వీక రించియున్నారు. వీరునూ ఇతర మూలగ్రంథమును యథాక్రమముగానే అనుకరించియున్నారు. అనగా వీరిద్దఱునూ వికారభ్రమ నివృత్తికి రజ్జుసర్పదృష్టాం తమునే గ్రహించిరనుట గమనించదగినది. "యథా సౌమ్య ఏకేన మృత్పిండేన సర్వంమృణ్మయం విజ్ఞాతం స్యాత్." ఇత్యాది శ్రుతి, "తదనన్యత్వం" ఇత్యాది సూత్రము మొదలగు శాస్త్రములు మృద్ఘటాది కోదాహరణములచే కార్యకారణముల కభేదమును

బోధించుచూ ముఖ్యముగా కార్య (జగత్) సత్య త్వము యొక్క భ్రాంతిని తొలగించుచూ కారణ (బ్రహ్మ)ము సత్యమని ప్రతిపాదించుటకే ప్రవర్తించి నవి. ఈ కారణములబట్టి యీ గ్రంథమునందునూ కనక రుచకదృష్టాంతమును జగత్సత్యత్వ భ్రమ నివృత్తికే గ్రహించి చతుర్థ పంచమ భ్రమ నివృత్తి దృష్టాంతములు మార్చబడినవని గ్రహించ వలయును. ఓమ్.

ఓమ్

సుబోధినీ వ్యాఖ్యా సహితమగు
పంచభ్రమ నివృత్తి నిరూపణము

జగత్సత్యత్వభ్రమ

అవ॥ పంచమమగు జగత్సత్యత్వభ్రమయొక్క లక్షణము జెప్పబడుచున్నది.

మూ॥ కారణాద్భిన్న జగతస్సత్యత్వం పంచమోభ్రమః।

పద॥ కారణాత్ - భిన్నజగతః - సత్యత్వం - పంచమః - భ్రమః.

ప్రతి॥ కారణాత్ = కారణమైన బ్రహ్మము కంటె, భిన్నజగతః = వేరైన జగత్తుయొక్క, సత్యత్వం = సత్యత్వము, పంచమః = ఐదవదియగు, భ్రమః = భ్రాంతి.

తా॥ జగత్కారణమగు బ్రహ్మముకంటె కార్యమగు జగత్తువేరుగా నున్నది, కనుక జగత్తు సత్యము. అనునది ఐదవదియగు భ్రాంతియగును.

విశే॥ కారణమగు కనకముకంటె కార్యమగు కుండలము వేరైనటుల కారణభూతమగు బ్రహ్మము కంటె కార్యభూతమగు జగత్తు భిన్నముగా నున్నది. కనుక కుండలమువలె జగత్తు సత్యమగును; అనుటయునూ భ్రాంతియే యగును. దీనినే 'జగత్సత్యత్వ భ్రమ' అని యందురు.

జగత్సత్యత్వ భ్రమ నివృత్తి

అవ॥ కనకరుచక దృష్టాంతముచేత జగత్సత్యత్వ భ్రమ నివర్తింప జేయబడుచున్నది.

మూ॥ కనకరుచక దర్శనేన కారణాద్భిన్న జగతస్సత్యత్వ భ్రమోనివృత్తః।

పద॥ కనకరుచక దర్శనేన - కారణాత్ - భిన్న జగతః - సత్యత్వభ్రమః - నివృత్తః.

ప్రతి॥ కనకరుచక దర్శనేన = సువర్ణమునందు ఆభరణముయొక్క దర్శనముచేత, కారణాత్ = కారణమగు బ్రహ్మముకంటె, భిన్నజగతః = కార్య రూపముతో వేరైన జగత్తుయొక్క, సత్యత్వభ్రమః = సత్యత్వభ్రాంతి, నివృత్తః = నివృత్తిని బొందినది.

తా॥ బంగారమునందు ప్రతీయమానమగు ఆభరణము బంగారముకంటె భిన్నమా? అభిన్నమా! అని విచారణజేసి బాగుగా దెలిసికొనుటచేత కార్యకారణ భావమువలన జగత్కారణరూపమగుబ్రహ్మముకంటె కార్యరూపముతో భిన్నమైనదివలెదోచు జగత్తు సత్యమను భ్రాంతి నాకు పూర్తిగా దొలగిపోయినది.

విశే॥ కనక కుండలములలో కనకము కారణము, కుండలము కార్యమును నగునని యందురు. కార్య కారణ భావముచేత వీనియందు భేదము భాసించు

చున్నది. అయిననూ ఆ భేదము కల్పితమే యగును గాని వాస్తవముగాదు. అనగా కనకమునందు కుండలము తోచకముందుగాని, తోచుచున్నపుడుగాని, ప్రలయము నొందినపుడుగాని కనకము సమానముగానే యుండునుసుమా! కనుక కనకము సత్యమగును. దానియందు ఒకప్పుడు తోచి, మరియొకప్పుడు తోచకపోవుటచేత కుండలము కల్పితమగును. కాబట్టి కుండలము కనకముకంటె భిన్నమైనదిగాదు. అభిన్నమైనదే. అనగా కనకస్వరూపమే యగును. కనుకనే "కనకే కుండలాభిధా'' అప॥ కనకమునందు కుండలమనునది నామమాత్రమేగాని వాస్తవముగాదు. కుండలమనగా కనకమే; అని భావము. మఱియు "సువర్ణాజ్జాయ మానస్య సువర్ణత్వం చ శాశ్వతమ్.'' అప॥ సువర్ణము (బంగారము) నుండి పుట్టుచున్న కుండలాదికమునకు సువర్ణత్వమే పూర్వోక్తరీతిగా నెల్లప్పుడునూ యుండునటి

ధర్మమగును. కుండలత్వాదికముగాదు. అది మధ్యలో కల్పితమైనదే యగునుసుమా! కనుక కుండలాదికము సువర్ణమేయగునుగాని అన్యముగాజాలదు; అని తాత్ప ర్యము. అందువలన కార్యకారణ భావమును పురస్క రించుకొని కనకముకంటె భిన్నమైనదివలె తోచు కుండలము సత్యమనుట భ్రాంతియేయగును.

ఆ విధముగానే బ్రహ్మము జగత్తునకు కారణము. జగత్తు బ్రహ్మమునకు కార్యమును నగునని యం దురు. కాబట్టి కార్యకారణ భావమువలన వీనియందు భేదము భాసించుచున్నది. ఆ భేదము కల్పితమే యగును. వాస్తవముగాజాలదు. అనగా బ్రహ్మము నందు జగత్తు భాసించకముందుగాని, భాసించు చున్నపుడుగాని ప్రలయమైనపుడుగాని బ్రహ్మ సమా నముగానే యుండునుసుమా! కనుక బ్రహ్మ సత్య మగును. ఆ బ్రహ్మమునందు ఒకప్పుడు భాసించి, మరియొకప్పుడు భాసించకపోవుటవలన జగత్తు కల్పి

తమేయగును." ఏది దేనియందుకల్పితమగునో అది దానికంటె భిన్నముగా సిద్ధముగాదు." అను నియమమునుబట్టి బ్రహ్మమునందు కల్పితమైన జగత్తు బ్రహ్మముకంటె భిన్నముగా సిద్ధముగాజాలదు. కనుక బ్రహ్మాభిన్నమైనదే. అనగా బ్రహ్మస్వరూపమేయగును.

సర్వం ఖల్విదం బ్రహ్మ నేహనానాస్తి కించన॥

ఎదుట కన్పట్టునట్టి చరాచరాత్మకమగు జగం బంతయు బ్రహ్మమేయగును. ఇచట ఆ బ్రహ్మముకంటె అన్యముగా అనేకమనునది కొంచెమైననూలేదు. అని యీ శ్రుతి అన్వయ వ్యతిరేకములచే ప్రపంచము బ్రహ్మస్వరూపమే యగునని శాసించినది. కనుక కల్పితమగు కార్యకారణ భావమును పురస్కరించు కొని బ్రహ్మముకంటె అన్యమైనదివలె గోచరించు జగత్తు సత్యమనుట భ్రాంతియేయగును.

మఱియు జగత్తు నామరూపాత్మకము. మృత్తిక యందు ఘటమను నామము. పృథు బుధ్నోదరాద్యా

కారమునూ కల్పితమైనటుల బ్రహ్మమునందు జగత్తనునామము, వివిధాకారమునూ కాల్పనికమే యగునుసుమా! పూర్వోక్త నియమానుసారముగా విచారణజేసినయెడల మృత్తికయందు కల్పితములైన ఘట నామరూపములు మృత్తికకంటె భిన్నములు గానటుల సచ్చిదానందస్వరూపమగు బ్రహ్మమునందు కల్పితములైన జగన్నామరూపములు సచ్చిదానంద స్వరూప బ్రహ్మముకంటె అన్యముగా సిద్ధము గాజాలవు. అట్టి బ్రహ్మమే యగును.

సత్తాస్ఫురణ సౌఖ్యాని భాసంతే సర్వవస్తుషు।
తస్మాద్బ్రహ్మమయం సర్వమితి వేదాంత డిండిమః॥

తా॥ సత్తు, చిత్తు, ఆనందమునూ సర్వ పదార్థములయందు భాసించుచున్నవి. అనగా ఘట మున్నది; అని సత్తు, ఘటము ప్రతీయమాన మగు చున్నది; అని చిత్తు, ఘటము జలాద్యాహరణ యోగ్యమైనది; అని ఆనందమునూ ఘటమునందు

ప్రకాశించుచున్నవికదా! ఇట్లే సమస్త పదార్థముల యందు బ్రహ్మస్వస్వరూపముతో వ్యాపించియున్నది. కాబట్టి బ్రహ్మాండమంతయు బ్రహ్మస్వరూపమే యగును.

వాచారంభణం వికారో నామధేయం
మృత్తికేత్యేన సత్యమ్॥ ఛాం. 6.

మృద్వికారమైన ఘటాదికము కేవలము వాక్కు-చేతనే యున్నదనబడుచున్నది. ఇది పేరుమాత్రమే కదా! అనగా ఘటాదిక మసత్యమేయగును. మృత్తిక మాత్రమే సత్యమగును; అని భావము. దీనివలన బ్రహ్మకంటె వ్యతిరేకముగా జగద్రూపమగు కార్య జాతము లేనేలేదని గమ్యమానమగుచున్నది.

తదనన్యత్వ మారంభణశబ్దాదిభ్యః ॥బ్ర॥సూ.2-1-14

కార్యకారణములకు అనన్యత్వమే అవగతమగుచున్నది. అనగా మిక్కిలి విస్తారమైన ఆకాశాది జగత్తు కార్యము. పరబ్రహ్మ కారణము. ఆ బ్రహ్మ

రూపమగు కారణముకంటె ఆకాశాది జగద్రూపమగు కార్యము అన్యముగాలేదు. వాచారంభణ మిత్యాది శ్రుతులవలన నీ విషయ మవగతమగుచున్నది.

ఘటనామ్నా యథాపృథ్వీ పటనామ్నా హి తంతవః।
జగన్నామ్నా చిదాభాతి జ్ఞేయం తత్తదభావతః॥

తా॥ బ్రహ్మమునందు జగన్నామరూపములు కల్పితములు. కనుక అవి యసత్యములు. కాబట్టి ఘటమను పేరుతో పృథ్వి. పటమను పేరుతో ప్రోగులునూ ఎట్లు భాసించుచున్నవో, అట్లు జగత్తను పేరుతో చిద్రూపమగు బ్రహ్మము ప్రకాశించుచున్నది. అంతేగాని ఆ బ్రహ్మముకంటె భిన్నముగా జగత్తను మరియొక వస్తువు లేనేలేదని యెరుగవలయును.

బ్రహ్మైవేదం విశ్వమిత్యేవవాణీ
శ్రౌతీబ్రూతేఽథర్వనిష్ఠావరిష్ఠా।

తస్మాదేతద్బ్రహ్మమాత్రం హి విశ్వం
నాధిష్ఠానాద్భిన్న తారోపితస్య॥ వివేక. 233

తా॥ "బ్రహ్మైవేదం విశ్వమ్" ఈ ప్రపంచము బ్రహ్మమే. అని అథర్వణవేదముయొక్క శ్రేష్ఠమైన వాక్కు జెప్పుచున్నది. అందువలన నీ విశ్వమంతయు బ్రహ్మమేగాని అన్యముగాదు. ఆరోపిత (కల్పిత) వస్తువు అధిష్ఠానముకంటె భిన్నము గాజాలదు.

సత్యంయదిస్యా జ్జగదేతదాత్మనోఽ
నం తత్వహానిర్నిగమా ప్రమాణతా।
అసత్యవాదిత్వమపీశితుస్స్యాత్
నైతత్త్రయం సాధుహితం మహాత్మనామ్॥
వివేక. 234

ఈ జగత్తు సత్యమేయైనయెడల సత్యజగద్వస్తువు చేత పరిచ్ఛిన్నమైన ఆత్మకు వస్తుపరిచ్ఛేద శూన్యత్వ

రూపమగు ఆనంతత్వము లేకపోవును; అందుచేత "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" పరమాత్మ సత్య స్వరూ... జ్ఞానస్వరూపము, అనంతస్వరూపమును నగునని శాసించు శ్రుతికి అప్రామాణ్యము సంభవిం చును; ఈ కారణముచేత పరమాప్తుడు, (యథార్థ వక్త) సర్వజ్ఞుడునైన పరమేశ్వరునకు అసత్యవాది త్వము వచ్చిపడును. అద్వితీయాత్మానుభవముగల మహాత్ములకు స్వానుభవ విరుద్ధమగుటవలన నీ దోష త్రయము యెంతమాత్రము సమ్మతముగాదు. కనుక ప్రపంచము సత్యము గానేరదని భావము.

యదిసత్యం భవేద్విశ్వం సుషుప్తావుపలభ్యతామ్।
యన్నోపలభ్యతేకించిదతో ఒసత్స్వప్న వన్మృషా॥

టీ॥ ప్రపంచము సత్యమైనయెడల సుషుప్తి యందునూ గోచరించవలసియుండును. అట్లు కొంచె మైననూ గోచరించుటలేదు గనుక అసత్తగును.

ల్లని కుండేటికొమ్మువలె అసత్తుగా జాలదు; మరేమన దృష్టనష్ట స్వరూపమైనది యగుటవలన స్వప్నమువలె మిథ్యయగునని భావము.

ఇట్లు కనకకుండలములు, మృత్తికా ఘటములు మొదలగు దృష్టాంతములతోగూడ బ్రహ్మ జగత్తుల చక్కగా విచారణ జేసినయెడల జగత్కారణమగు బ్రహ్మముకంటె భిన్నమైనదివలె భాసించునట్టి జగత్తు సత్యమను భ్రాంతి తొలగిపోవును. ఈ రీతిగా జగ దుత్పత్త్యత్వ భ్రమ నివృత్తమగునని, అంతయు పర బ్రహ్మ స్వరూపమనియు, ఆ పరబ్రహ్మమే తానని యున్నూ తెలిసికొని యనుభవించవలయును. ఓమ్.

ఓమ్

సుబోధినీ వ్యాఖ్యా సహితమగు

పంచభ్రమ నివృత్తి నిరూపణము

భ్రమ నివృత్తి కవధి

అవ॥ పంచభ్రమల నివృత్తి యెప్పుడగునో చెప్ప బడుచున్నది.

మూ॥ పంచభ్రమ నివృత్తిశ్చ తదా స్ఫురతి చేతసి।

పద॥ పంచభ్రమ నివృత్తిః - చ - తదా - స్ఫురతి - చేతసి.

ప్రతి॥ పంచభ్రమనివృత్తిశ్చ =ఐదు రకములగు భ్రమలయొక్క నివృత్తియును. (యదా =ఎప్పుడు, సద్గురు సన్నిధౌ = సద్గురు సన్నిధియందు, అధికారీ= ఉత్తమాధికారియగు శిష్యుడు, శ్రద్ధయా = శ్రద్ధతో

ఆత్మతత్త్వవిచారణా = ఆత్మతత్త్వముయొక్క విచారణ. బింబ ప్రతిబింబాది దృష్టాంతైస్సహ = బింబ ప్రతిబింబము మొదలగు దృష్టాంతములతోకూడ. (క్రియతే = చేయబడుచున్నదో.) తదా = అప్పుడు. చేతసి = మనస్సునందు. స్ఫురతి=స్ఫురించుచున్నది.

తా॥ శ్రీ సద్గురు సన్నిధిలో ఎప్పుడు ఉత్తమాధికారియగు శిష్యుడు మిక్కిలి శ్రద్ధతో ఉక్తరీతిగా బింబ ప్రతిబింబాది దృష్టాంత దార్ష్టాంతముల సమన్వయ పూర్వకముగా ఆత్మతత్త్వవిచారణ చేయునో అప్పుడు ఆ యధికారి చిత్తమున భేదభ్రమ మొదలగు పంచభ్రమలయొక్క నివృత్తి స్ఫుటముగా స్ఫురించును.

విశే॥ శాస్త్రముయొక్క, సద్గురు దేవునియొక్క వాక్యములు సత్యములు; అను నిశ్చయబుద్ధిచేత వానియందు గల దృఢవిశ్వాసము శ్రద్ధయనబడును. ఇది

గలవారికే బ్రహ్మవిద్య పట్టుబడును. శ్రద్ధ లేనివారికి పట్టుబడదు, కనుకనే "శ్రద్ధావా౯ లభతే జ్ఞానమ్" శ్రద్ధ గలవాడే జ్ఞానమును బొందును. "అశ్రద్ధధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప॥ అప్రాప్య మాం నివర్తంతే మృత్యు సంసార వర్త్మని॥" అశ్రద్ధాది శత్రువులను తపింప జేయుచున్న అర్జునా! ఈ ఆత్మజ్ఞాన ధర్మమునుగూర్చి అశ్రద్ధ గలవారు నన్ను బొందక మృత్యుయుక్తమగు నరక తిర్యగాది ప్రాప్తి లక్షణమైన సంసారమార్గమునందే నిశ్చయముగా నుందురు. అని శ్రీ భగవంతుడు శ్రద్ధాశ్రద్ధల తారతమ్యమును వివరించియున్నాడు. కనుక ఆత్మవిజ్ఞానమునకు శ్రద్ధ ముఖ్యసాధనము. అందుచేత శ్రద్ధావంతులై, ఈ పంచశ్రమ నివృత్తులగూర్చి బాగుగా విచారణ సలిపి భ్రాంతి రహితులై, ఆత్మ విజ్ఞానవంతులై విరాజిల్లుదురు గాక.

స్వానుభవము - పరానుగ్రహము

అవ॥ పంచభ్రమ నివృత్తివలన ఆత్మానుభూతి, శిష్యానుగ్రహము యిచట బోధింపబడుచున్నది.

మూ॥ తదా ప్రభృతి మచ్చిత్తం బ్రహ్మాకారమభూత్స్వయమ్।
విదాఘ। త్వమపీత్థం హి తత్త్వజ్ఞాన మవాప్నుహి॥

పద॥ తదా - ప్రభృతి - మచ్చిత్తం - బ్రహ్మాకారం - అభూత్ - స్వయం - నిదాఘ! - త్వం - అపి - ఇత్థం - హి - తత్త్వజ్ఞానం - అవాప్నుహి.

ప్రతి॥ (యదా = ఎప్పుడు, ఆచార్యసన్నిధౌ = సద్గురు సన్నిధిలో, పంచభ్రమాః = పంచభ్రమలను, తన్నివృత్తీశ్చ = వానియొక్క నివృత్తులనుగూర్చి, శ్రద్ధయా = శ్రద్ధచేత, ఏకాగ్రచిత్తేన = ఏకాగ్ర చిత్తముచేత, అహం = నేను, విచారితవాః = విచారించితినో), తదా = అప్పుడు, ప్రభృతి = మొదలుకొని. మచ్చిత్తం = నాచిత్తము, స్వయం =

స్వయముగా. బ్రహ్మాకారం = బ్రహ్మాకారముగలది అభూత్ = ఆయెను. నిదాఘ! = ఓ నిదాఘుడా!. త్వమపి = నీవునూ, ఇత్థం హి = ఈ విధముగానే. తత్త్వజ్ఞానం = తత్త్వజ్ఞానమును, అవాప్నుహి = పొందుము.

తా॥ మహాత్ములగు ఆచార్యుల సన్నిధిలో ఆత్మతత్త్వవిషయికములగు నీ పంచప్రశ్నలను, వాని వివృత్తులనుగూర్చి శ్రద్ధతో సావధానమనస్కుడనై యెప్పుడు విచారణజేసితినో, అప్పుడు మొదలుకొని నాచిత్తము తనంతటతానే బ్రహ్మాకారమును బొందినది. అనగా నేను బ్రహ్మాత్మతత్త్వవిజ్ఞానసంపన్నుడనైతిని. కనుక ఉత్తమాధికారివై, శ్రేయస్సాధనమగు బ్రహ్మజిజ్ఞాసగలిగిన ఓ నిదాఘా! నీవునూ నావలెనే శ్రద్ధతో ఆత్మతత్త్వ ప్రబోధకములగు నీపంచప్రశ్న వివృత్తులగూర్చి బింబప్రతిబింబదృష్టాం

తాదులతో పునఃపునః విచారించి జీవబ్రహ్మైక్య సాక్షాత్కారమును బొందుము. జీవన్ముక్తులవై విరాజిల్లుము.

వి॥ ప్రథమమున నిదాఘుడు తమ రేయుపాసన యొనర్చి యిట్టి జ్ఞానమును బొందితిరని యడిగిన ప్రశ్నకు ఋభుమహర్షులవారు నేను గురుముఖముగా పంచక్రమ వివృత్తుల బాగుగా విచారించి ఇట్టి జ్ఞానమును బడసితినని "తదా ప్రభృతి" ఇత్యాదికముతో ప్రత్యుత్తర మిచ్చిరని గ్రహించదగినది. మరియు ఉత్తమాధికారులై వినయ విధేయతలతో భక్తిశ్రద్ధలతో మెలగు శిష్యులయందు సద్గురువులకు స్వయముగానే మహానుగ్రహ ముదయించును. నిదాఘు డట్టివాడు గనుకనే ఋభుమహర్షులవారు ప్రేమతో దయతో ఆత్మతత్త్వోపదేశ మొనర్చి నీవునూ నా విధముగానే తత్త్వసాక్షాత్కారమును బడయుము. అవి మిక్కిలి

యనుగ్రహముతో తమంతటతామే యాశీర్వదించిరి. ఓహో! విదాఘుడెంతటి పుణ్యాత్ముడు. ఎంతటి ధన్యాత్ముడు. శ్రీ సద్గురుదేవుని యనుగ్రహపాత్రు డగు శిష్యునికి సులభముగా బ్రహ్మవిజ్ఞానము, కైవల్య మోక్షమునూ కరతలామలక మగుననియునూ గమ నించదగినది. ఓమ్.

ఇట్లు సుభోధినీ వ్యాఖ్యాసహితమగు
పంచభ్రమ నివృత్తి నిరూపణము
సమాప్తము.

ఓం లోకా స్సమస్తా స్సుఖినో భవంతు
ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః.
ఓమ్ తత్ సత్
ఓమ్.

ఓమ్

పంచభవ నిరూపణము

1. నిదాఘోనామయోగీంద్రః
ఋభుంబ్రహ్మవిదాంవరమ్।
ప్రణమ్యదండవద్భూమా
వుత్థాయసపునర్మునిః॥

2. ఆత్మతత్త్వమనుబ్రూహి
త్యేవంపప్రచ్ఛసాదరమ్।
కయోపాసనయాబ్రహ్మ
న్నీదృశంప్రాప్తవానసి॥

3. తాం మేబ్రూహిమహావిద్యాం
మోక్షసామ్రాజ్యదాయినీమ్।
నిదాఘ। త్వంకృతార్థోసి
శృణువిద్యాం సనాతనీమ్॥

4. యస్యవిజ్ఞానమాత్రేణ
జీవన్ముక్తోభవిష్యసి।
భ్రమః పంచవిధోభాతి
తదేవేహసముచ్యతే॥

5. జీవేశ్వరాభిన్నరూపా
వితిప్రాథమికో భ్రమః।
ఆత్మనిష్ఠంకర్తృగుణం
వాస్తవంవాద్వితీయకః॥

6. శరీరత్రయసంయుక్తో
జీవస్సంగీత్వతీయకః।
జగత్కారణరూపస్య
వికారిత్వం చతుర్థకః॥

7. కారణాద్భిన్న జగతస్సత్యత్వం
పంచమోభ్రమః।
పంచభ్రమనివృత్తిశ్చ
తదాస్ఫురతి చేతసి॥

౮. బింబప్రతిబింబదర్శనేన
భేదభ్రమో నివృత్తః।
స్ఫటికలోహిత దర్శనేన
పారమార్థికకర్తృత్వభ్రమో నివృత్తః॥

౯. ఘటమఠాకాశదర్శనేన సంగిత్వభ్రమో నివృత్తః।
కనకరుచకదర్శనేన వికారిత్వభ్రమో నివృత్తః॥

10. రజ్జుసర్పదర్శనేనకారణాద్భిన్న
జగతస్సత్యత్వభ్రమో నివృత్తః।
తదాప్రభృతిమచ్చిత్తం
బ్రహ్మాకారమభూత్స్వయమ్॥

11. నిదాఘః త్వమపీత్థంహి
తత్త్వజ్ఞానమవాప్నుహి॥

పంచభ్రమ నిరూపణం సమాప్తమ్.

ఓం తత్ సత్

ఓమ్

ఓమ్

విజ్ఞాననౌకా

1. తపోయజ్ఞదానాదిభిశ్శుద్ధబుద్ధి
ర్విరక్తో నృపాదౌ పదే తుచ్ఛబుద్ధ్యా।
పరిత్యజ్య సర్వం యదాప్నోతి తత్త్వం
పరంబ్రహ్మ నిత్యం తదేవాహమస్మి॥

2. దయాళుం గురుం బ్రహ్మనిష్ఠం ప్రశాంతం
సమారాధ్య భక్త్యా విచార్య స్వరూపమ్।
యదాప్నోతి తత్త్వం నిదిధ్యాస్య విద్వాన్
పరంబ్రహ్మ నిత్యం తదేవాహమస్మి॥

3. యదానందరూపం ప్రకాశస్వరూపం
నిరస్తప్రపంచం పరిచ్ఛేదశూన్యమ్।
అహంబ్రహ్మవృత్త్యైకగమ్యం తురీయం
పరంబ్రహ్మ నిత్యం తదేవాహమస్మి॥

4. యదజ్ఞానతోభాతివిశ్వం సమస్తం
ప్రణష్టంచసద్యో యదాత్మప్రబోధే॥
మనోవాగతీతం విశుద్ధంవిముక్తం
పరంబ్రహ్మనిత్యం తదేవాహమస్మి॥

5. అనంతంవిభుం నిర్వికల్పంనిరీహం
శివంసంగహీనంయదోంకారగమ్యమ్।
నిరాకారమత్యుజ్జ్వలం మృత్యుహీనం
పరంబ్రహ్మనిత్యం తదేవాహమస్మి॥

6. నిషేధేకృతే నేతినేతీతి వాక్యై
స్సమాధిస్థితానాం యదాభాతిపూర్ణమ్।
అవస్థాత్రయాతీత మద్వైతమేకం
పరంబ్రహ్మనిత్యం తదేవాహమస్మి॥

7. యదానందలేశైస్సదానందవిశ్వం
యదాభాతిసత్త్వే తదాభాతిసర్వమ్।
యదాలోచనేహేయమన్యత్సమస్తం
పరంబ్రహ్మనిత్యం తదేవాహమస్మి॥

8. యదానందసింధౌ నిమగ్నః పుమాన్స్యా
"దవిద్యావిలాసస్సమస్తప్రపంచః।"
తదానస్ఫురత్యద్భుతంయన్నిమిత్తం
పరంబ్రహ్మనిత్యం తదేవాహమస్మి॥

9. "స్వరూపానుసంధానరూపాంస్తుతిం యః
పఠేదాదరాద్భక్తిభావో మనుష్యః।
శృణోతీహవానిత్యముద్యుక్తచిత్తః"
భవేద్విష్ణురత్రైవవేదప్రమాణాత్॥"

ఇతి శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీమచ్ఛంకరాచార్య విరచితం శ్రీ విజ్ఞాననౌకాష్టకం
సంపూర్ణ.

ఓమ్. తత్ సత్

ఓమ్

ఓమ్

విజయఘోషలు

1. దైవమతము ప్రతిష్ఠిత మగును గాక।
2. కరుణామతము వృద్ధి నొందును గాక।
3. శాంతిమతము స్థాపిత మగును గాక।
4. సత్యమతము స్థిరప్రతిష్ఠ నొందును గాక।
5. ధర్మమతము ఉద్ధరింపబడును గాక।
6. ఋషిమతము వర్ధిల్లును గాక।
7. స్వాతంత్ర్యమతము జయించును గాక।
8. జ్ఞానమతము వ్యాపక మగును గాక।

ఓం తత్సత్ ఓమ్